RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 98 | గురువారం, మే 16, 2024 | పేజీలు : 4

### మద్యం సేవించి వాహనాలు నడిపిన 22, మందికి 25.500- వేల రూపాయల జరిమానా

సిద్దిపేట: సిద్దిపేట వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మి బాబు, మరియు ఎస్ఐలు సిబ్బందితో కలిసి గత నెల రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో మరియు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా, 22, మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా బుధవారం రోజు సిద్దిపేట అడిషనల్ జెఎఫ్సియం వి. శ్రావణి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 22 మందికి 25,500/-వేల రూపాయల జరిమాన విధించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మి బాబు, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



### సిఎఎ కింద మొదటి సెట్ పౌరసత్వం

## సర్టిఫికేట్లు పంపిణీ

న్యూఢిల్లీ : పౌరసత్వ (సవరణ) చట్టం (సిఎఎ) కింద మొదటి సెట్ పౌరసత్వం సర్టిఫికేట్లను బుధవారం 14 మంది వ్యక్తులకు జారీ చేశారు. కేంద్రం నిబంధనలు రూపొందించిన సుమారు రెండు నెలల అనంతరం ఆ సర్టిఫికేట్ల పంపిణీ జరిగింది. సిఎఎ కింద పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లలో మతపరమైన కారణాలతో వేధింపులకు గురైన, 2014 డిసెంబర్ 31 లోపు భారత్‌కు వచ్చిన మైనారిటీలు భారత్‌లో పౌరసత్వం పొందవచ్చు. వారిలో హిందువుల, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, క్రైస్తవులు ఉన్నారు. సిఎఎను పార్లమెంట్ ఆమోదించిన నాలుగు సంవత్సరాల అనంతరం మార్చి 11న కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ నిబంధనల నోటిఫికేషన్ జారీ చేసింది. 14 మంది వ్యక్తుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేసిన తరువాత వారు బుధవారం పౌరసత్వం సర్టిఫికేట్లు అందుకున్నారు. కేంద్ర హోమ్ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా వారికి సర్టిఫికేట్లు అందజేశారు.

## ఆ వ్యాఖ్యలు ముస్లింలనుద్దేశించి కాదు



వారణాసి: చొరబాటుదారులు, ఎక్కువమంది సంతానం ఉన్నవారు అంటూ తాను చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వివరణ ఇచ్చారు. తాను కేవలం ముస్లింల గురించి మాత్రమే మాట్లాడలేదని, పేద కుటుంబాల గురించి మాట్లాడానని ఒక ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని స్పష్టం చేశారు. హిందూ-ముస్లిం అంటూ తాను మాట్లాడిన రోజున తాను ప్రజా జీవితానికి అర్హుడిని కానని మోడీ ప్రకటించారు. ముస్లింల పట్ల చూపే ప్రేమను తాను మార్కెటింగ్ చేసుకోనని ఆయన వ్యాఖ్యానించారు. తాను ఓటు బ్యాంకు కోసం పనిచేయనని, తాను సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్‌ను నమ్ముతానని ఆయన చెప్పారు. ఎక్కువ మంది సంతానం గురించి మాట్లాడిన ప్రతిసారి ఆ ప్రస్తావన ముస్లింల గురించే అని మీకు ఎవరు చెప్పారు? ముస్లింల పట్ల ఎందుకు ఇంత అన్యాయంగా ఉంటున్నారు? పేద కుటుంబాలలో కూడా ఇదే పరిస్థితి ఉంది. పేదరికం ఉన్న చోట ఎక్కువ మంది పిల్లలు ఉంటారు. వారి సామాజిక నేపథ్యం ఏదైనా కానివ్వండి. నేను హిందువులు లేదా ముస్లింలు అని ఎప్పుడూ ప్రస్తావించలేదు. స్తోమతను బట్టే సంతానం సంఖ్య ఉండాలని మాత్రమే నేను చెప్పాను. మీ పిల్లల సంరక్షణను ప్రభుత్వం తీసుకునే పరిస్థితి తీసుకురానివ్వకండి అని ప్రధానిస్పష్టం చేశారు. గుజరాత్‌లో గోద్రా రైలు దగ్ధం ఘటన అనంతరం జరిగిన అల్లర్ల గురించి ప్రస్తావిస్తూ తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2002(గోద్రా అల్లర్లు) తర్వాత ముస్లింలలో తన ప్రతిష్టను ప్రత్యర్థులు నాశనం చేశారని ప్రధాని చెప్పారు. ఇది ముస్లింలకు సంబంధించిన సమస్య కాదు. కొందరు ముస్లింలు మోడీకి మద్దతుగా ఉన్నప్పటికీ ఇది చేయండి..అది చేయండి అంటూ ప్రభంజనంలా జరిగే ప్రచారం వారిపై ప్రభావం చూపుతుంది. మా ఇంట్లో నా చుట్టూ ముస్లిం కుటుంబాలే ఉండేవి. మా ఇంట్లో ఈద్ కూడా జరుపుకునేవారం. ఇతర పండుగలు కూడా మా ఇంట్లో జరిగేవి. ఈద్ రోజున మా ఇంట్లో వంట ఉండేది కాదు. అన్ని ముస్లిం కుటుంబాల నుంచి మా ఇంటికి భోజనం వచ్చేది. ఇప్పటికీ నాకు చాలా మంది ముస్లిం మిత్రులు ఉన్నారు. 2002 తర్వాత(గోద్రా) నా ప్రతిష్ట నాశనం అయ్యింది అని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలలో ముస్లింలు మీకు ఓటు వేస్తారా అన్న ప్రశ్నకు ఈ దేశ ప్రజలు నాకు ఓటు వేస్తారు అని మోడీ జవాబిచ్చారు. హిందూ-ముస్లిం అంటూ నేను మాట్లాడిన రోజున ప్రజా జీవితంలో ఉండేందుకు నేను అర్హుడిని కాను. హిందూ-ముస్లిం అంటూ మాట్లాడను. ఇది నా ప్రతిజ్ఞ అంటూ ప్రధాని ప్రకటించారు.

### వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కారు మోసం..

## రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చిన కేసీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడమేనని.. దగా చేయడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను గులాబీ బాస్ ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “‘రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది?’ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వచించింది. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతుబంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది. అందు కారణంగానే రైతాంగ హక్కులను హామీలను సాధించేందుకే బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టింది’ కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులపక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పుచ్చుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ వడ్ల కల్లాలకాడికి బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లాలని.. రైతులకు అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు

## షాకే...

### జూన్ నాలుగున దిమ్మతిరుగుడు ఖాయం



కరీంనగర్ : ముస్లింలంతా ఏకమై బండి సంజయ్ ని ఓడించాలని కేసీఆర్ పిలుపునిస్తే హిందువులంతా ఏకమై బండి సంజయ్ ని గెలిపించబోతున్నారని అన్నారు బిజెపి అభ్యర్థి బండి. హిందువులు ఏకమైతే ఎలాంటి ఫలితాలు వస్తాయో జూన్ 4వ తేదీన కరీంనగర్ పార్లమెట్ నియోజకవర్గం పరిధిలో చూపించబోతున్నారన్నారు. ఈ మేరకు ఆయన ట్విట్ చేశారు. జూన్ 4న రాబోయే ఫలితాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెంపపెట్టు తప్పదని అన్నారు. కేసీఆర్ లాంటి వ్యక్తుల కుటిల పన్నాగాలకు హిందువులంతా ఐక్యత చూపించారన్నారన్నారు. ఆ షాక్ ను చూసి కేసీఆర్ తట్టుకునేందుకు పక్కన సిద్దంగా డాక్టర్లను పెట్టుకోవాలన్నారు. కేసీఆర్ వందేళ్లు బతకాలని కోరుకునే వ్యక్తులం తామని.. ఇకనైనా ఓ వర్గానికి కొమ్ము కాస్తూ హిందువులను రాచిరంపాన పెట్టవద్దన్నారు.

### జూన్ 4 తరువాత మోడీ

## ప్రధానిగా ఉండరు



న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ (బిజెపి) తన ‘అబద్ధాల’ ద్వారా తనను తాను ఎంతగా సంతృప్తిపరచుకున్నా అది ఏమాత్రం తేడా చూపించబోదని, నరేంద్ర మోడీ జూన్ 4 తరువాత ప్రధానిగా ఉండబోరని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బుధవారం ప్రకటించారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ పొందుపరచిన ఒక వీడియోను రాహుల్ పంచుకునానరు. ఉత్తర ప్రదేశ్‌లో ఒక ఎన్నికల ర్యాలీలో తాను చేసిన వ్యాఖ్యలను ఏవిధంగా ‘వక్రీకరించారో’, నిజం, అబద్ధాల మధ్య తేడా చూపించారో ఆ వీడియో స్పష్టం చేసింది. ‘బిజెపి ‘అబద్దాల ఫ్యాక్టరీ’ ద్వారా తనను తాను ఎంతగా సంతృప్తి పరచుకున్నా అది ఏమాత్రం తేడా తీసుకురాదు. జూన్ 4 తరువాత నరేంద్ర మోడీ ఇక ఎంత మాత్రం ప్రధానిగా ఉండరని నేను మళ్లీ చెబుతున్నాను’ అని రాహుల్ ‘ఎక్స్’లో హిందీ పోస్ట్‌లో తెలిపారు. ‘దేశంలో ప్రతి మూల ఇండియాకు అనుకూలంగా పెనుగాలి వీస్తోంది’ అని రాహుల్ ప్రతిపక్ష కూటమిని దృష్టిలో పెట్టుకుని అన్నారు. ఇండియా కూటమి తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి అధికార చ్యుతి కలుగుతుందని కాంగ్రెస్‌తో పాటు రాహుల్ జోస్యం చెబుతున్నారు.

### బోల్ గార్డ్ 11 రకం పత్తి విత్తనాలు

## సిద్ధం చేయండి



హైదరాబాద్: ఖరీఫ్ 2024లో రాష్ట్రంలో దాదాపు 60.53 లక్షల ఎకరాల్లో ప్రత్తి సాగు కాగలదని వ్యవసాయశాఖ అంచనా వేయగా, దానికి సరిపడా పత్తి విత్తనాలను మే చివరి నాటికి రైతులకు అందుబాటులో ఉంచే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 2021లో 60.53 లక్షలు ఉన్న ప్రత్తి విస్తీర్ణం క్రమంగా తగ్గుతూ 2023లో 45.17లక్షలకు వచ్చిందనీ, ఐనప్పటికీ ప్రపంచ మార్కెట్లో ప్రత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశముందన్నారు.. దీనికి తగ్గట్టుగానే బీజీ11 రకం విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించారు. నేడు హైదరాబాద్ సచివాలయంలో జరిగిన వ్యవసాయ శాఖ అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గతేడాది 90 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోగా, ఈసారి 120 లక్షల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెండు దఫాలు సంబంధిత అధికారులు, విత్తన కంపెనీలతో సమావేశం జరిపి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈసారి బోల్ గార్డ్ 11 రకం ప్రత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864.00 గా నిర్ణయించిదని, ఏ ఒక్క డీలరైనా, అంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే ఏ కంపెనీని ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలకు భంగం కల్గించే ఏ చర్యను ఈ ప్రభుత్వం సహించబోదని, విధుల పట్ల అలసత్వం వహించినా అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు.

### ఎన్నికల పిదప చిన్న ప్రతిపక్షాలు

## కాంగ్రెస్‌లో విలీనం



న్యూఢిల్లీ : కాంగ్రెస్ వైపు వెళితే ముప్పు తప్పదని వోటర్లను ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం హెచ్చరించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్కరే నాయకత్వంలోని శివసేన వర్గాన్ని మోడీ ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. వేడి వాతావరణంలో ముంబయిలో ఎన్నికల సభలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, మహారాష్ట్ర పార్టీ కాంగ్రెస్ బాట పట్టిన రోజు శివసేనకు ముగింపే అవుతుందని శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాక్కరే భావించారని చెప్పారు. ‘డూప్లికేట్ శివసేనను శిక్షించాలని మహారాష్ట్ర కృతనిశ్చయానికి వచ్చింది. ఆ శివసేన కాంగ్రెస్ ముందు మోకరిల్లింది’ అని మోడీ అన్నారు. శివసేన నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)తో కూడిన కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన తరువాత శివసేన రెండు వర్గాలుగా చీలిపోయింది. ఉద్ధవ్ థాక్కరే తండ్రి ప్రారంభించిన పార్టీ పేరును షిండే అట్టిపెట్టుకోగలిగారు. ఆయన బిజెపి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ‘ఎన్నికల అనంతరం చిన్న పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అవుతాయి’ అని ప్రధాని మోడీ సూచించారు. ‘మోడీ అణగారిన ప్రజల హక్కుల చౌకీదార్. ఆయన వాటిని లాక్కోనివ్వరు & మతం ఆధారంగా బడ్జెట్‌ను విభజించడం ప్రమాదకరం. కాని కాంగ్రెస్‌కు మైనారిటీ అంటే దాని ప్రియమైన వోటు బ్యాంకు’ అని ప్రధాని అన్నారు.

గరుడ వార్త

గురువారం, మే 16, 2024

## సంపాదకీయం

# హిందువుల సంఖ్య తగ్గుతోందా

భారత జనాభాలో హిందువుల శాతం క్రమంగా తగ్గుతోందా.. అంటే అవుననే అంటున్నారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి(ఈఏసీ?పీఎం) తెలిపింది. భారత్‌లో హిందువుల జనాభా తగ్గుతూ ఉండగా, మరోవైపు బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల జనాభా పెరుగుతూ పోయింది. ఇక పార్సీలు, జైనులు జనాభా కూడా తగ్గింది. సమీప మిత్ర దేశాల్లో మెజారిటీ మతస్తుల సంఖ్య పెరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఆ జనాభా తగ్గినట్లు రిపోర్టులో తెలిపారు. 1950లో మన దేశంలో హిందువులు దేశ జనాభాలో 84.68 శాతం ఉండగా, 2015 నాటికి ఇది 78.06 శాతానికి క్షీణించిందని వెల్లడించింది. అంటే హిందువుల వాటా జనాభాలో 7.82 శాతం తగ్గిందని పేర్కొంది. ఇదే సమయంలో భారత దేశ జనాభాలో ముస్లింల శాతం పెరిగింది. 1950 భారత జనాభాలో 9.84 శాతం ఉన్న ముస్లిం జనాభా.. 2015 నాటికి 14.09 శాతం పెరిగినట్లు పేర్కొంది. ముస్లిం జనాభాలో పెరుగుదల పరిశీలిస్తే 43.15 శాతంగా నమోదైనట్లు వివరించింది. ఇక 1950?2015 మధ్య క్రైస్తవులు, సిక్కుల వాటా స్వల్పంగా పెరిగిందని తెలిపింది. జైనులు, పార్శీల శాతం తగ్గిందని వెల్లడిచింది. సమాజంలో భిన్నత్వాన్ని పెంపొందించేందుకు వీలుగా ఉన్న అనుకూల వాతావరణాన్ని ఈ మార్పులు సూచిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇక జనాభా హెచ్చుతగ్గుల్లో మార్పులకు కొన్ని కారణాలను సలహా మండలి స్పష్టం చేసింది. విధానపరమైన చర్యలు, రాజకీయ నిర్ణయాలు, సామాజిక ప్రక్రియలు సమాజంలో జనాభా హెచ్చు తగ్గులకు కారణమవుతాయని తెలిపింది. శామికా రవి నేతృత్వంలోని ఈఏసీ?పీఎం ప్రపంచ వ్యాప్తంగా 167 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసి ఈమేరకు నివేదికను రూపొందించింది. ఆయా వర్గాల జనాభా నిర్దిష్టంగా ఎంత ఉందన్నది మాత్రం నివేదికలో పేర్కొనలేదు. తాజా నివేదిక ప్రకారం దక్షిణాసియాలోని బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక, భూటాన్, ఆఫ్గానిస్థాన్ వంటి భారత పొరుగు దేశాల్లో మాత్రం ఆయా దేశాల్లోని మెజారిటీ మతస్థుల జనాభా శాతం పెరుగుతున్నట్లు నివేదిక తెలిపింది. మైనార్టీల వాటా గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. 1950?2015 మధ్య మాల్దీవులు మినహా అన్ని ముస్లిం మెజార్టీ దేశాల్లోనూ మెజార్టీ వర్గం ప్రజల వాటా పెరిగింది. మాల్దీవుల్లో మెజార్టీ వర్గంగా ఉన్న షఫీ సున్నీల వాట 1.47 శాతం తగ్గింది. బంగ్లాదేశ్‌లో మెజార్టీ మతస్తుల వాటా 18 శాతం పెరిగింది. భారత ఉపఖండంలో ఇదే అత్యధిక పెరుగుదల. మన దాయాది దేశం పాకిస్థాన్‌లో మెజార్టీ వర్గమైన హనాఫీ ముస్లింల వాటా 3.75 శాతం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. మొత్తంగా ఆదేశ జనాభాలో ముస్లింల వాటా పరంగా పెరుగుదల 10 శాతం నమోదైంది. ముస్లిమేతరులు మెజారిటీ వర్గాలుగా ఉన్న దేశాల్లో మయన్మార్, భారత్, నేపాల్‌లో మాత్రం మెజారిటీ మతస్థుల వాటా తగ్గిందని పేర్కొంది. ఇక అధిక ఆదాయం ఉన్న 35 దశాల్లో మెజార్టీ మతస్థుల వాటా నగటున 29 శాతం క్షీణించింది. ప్రపంచ నగటు(22శాతం)తో పోలిస్తే ఇది ఎక్కువ. 950 సంవత్సరంలో భారత్‌లో హిందువుల జనాభా 84.68 శాతం ఉండగా, 2015 నాటికి ఆ సంఖ్య 78.06 శాతానికి చేరుకున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. మరో వైపు గడిచిన 65 ఏళ్ల కాలంలో ముస్లిం జనాభా మాత్రం 9.84 శాతం నుంచి 14.09 శాతానికి పెరిగిందని స్టడీలో పేర్కొన్నారు. మయన్మార్‌లో హిందువుల జనాభా పది శాతం పడిపోయింది. నేపాల్‌లో కూడా హిందువుల సంఖ్య 3.6 శాతం తగ్గినట్లు తెలిపారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కేంద్రంపై మరోసారి విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి ఆర్థికవ్యవహారాల సలహా మండలి(ఈఏసీ?పీఎం) నివేదికలోని గణాంకాలపై తేజస్వీ యాదవ్ సందేహం వ్యక్తంచేశారు. తాజాగా జనగణన చేపట్టకుండానే దేశంలో హిందూ, ముస్లింల జనాభాపై కేంద్రం ఎలా ఒక అంచనాకు వస్తుందని ప్రశ్నించారు. దేశంలో ముస్లింల జనాభా పెరిగిందని, హిందువుల జనాభా తగ్గిందంటూ విడుదలచేసిన ఈఏసీ?పీఎం రిపోర్ట్‌పై ఆయన స్పందించారు. “ అసలైన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే హిందూ, ముస్లింల మధ్య మోడీ సర్కార్ చిచ్చుపెడుతోంది. జనాభా లెక్కలు లేకుండానే ఎలా ఈ కొత్త లెక్కలతో వచ్చారు.? 2021లో కూడా జనగణన ఎందుకు సాధ్యంకాలేదు. అప్పుడు, ఇప్పుడు మీరే అధికారంలో ఉన్నారు కదా. హిందూ, ముస్లింలను వేర్వేరుగా పక్షపాత ధోరణితో చూసే విధానాన్ని మానుకోండి. సమస్యల గురించే మాట్లాడండి’ అని తేజస్వీ హితవు పలికారు. హిందువుల సంఖ్య తగ్గుతోందా భారత జనాభాలో హిందువుల శాతం క్రమంగా తగ్గుతోందా.. అంటే అవుననే అంటున్నారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి(ఈఏసీ?పీఎం) తెలిపింది. భారత్‌లో హిందువుల జనాభా తగ్గుతూ ఉండగా, మరోవైపు బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల జనాభా పెరుగుతూ పోయింది. ఇక పార్సీలు, జైనులు జనాభా కూడా తగ్గింది. సమీప మిత్ర దేశాల్లో మెజారిటీ మతస్తుల సంఖ్య పెరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఆ జనాభా తగ్గినట్లు రిపోర్టులో తెలిపారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కారానికై రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

## - శామీర్ పేట సబ్ డివిజన్ పరిధిలో పర్యటించిన విద్యుత్ శాఖ ఎస్ ఈ





**శామీర్ పేట, (గరుడ వార్త) :** విద్యుత్ సమస్యల పరిష్కారానికై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులే స్వయంగా రంగంలోకి దిగారు. శామీర్ పేట విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రీరామ్మోహన్ పర్యటించి వినియోదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం శామీర్ పేట విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని శామీర్ పేట సెక్షన్ దేవరయంజాల్, అలియాబాద్ సెక్షన్ మజీద్ పూర్, నాగిశెట్టిపల్లి తండా గ్రామాలలోని ఎస్సీ, ఎస్టి కాలనీలలో పర్యటించారు. ఆయా కాలనీలలో విద్యుత్ శాఖ అధికారులు పర్యటిస్తూ సమస్యలపై, 24 గంటల నాణ్యమైన విద్యుత్ పై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు.
గృహ జ్యోతిలో లబ్ధి పొందని వినియోగదారులు ఉంటే తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా విద్యుత్ అంతరాయాలు, విద్యుత్ బిల్లులు ఆలస్యం, మొదలగు అన్ని విషయాలను విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్క విస్తున్నారని అధికారులు ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ డి ఈ శ్రీనాథ్ రెడ్డి, శామీర్ పేట సబ్ డివిజన్ ఏ డి ఈ ఎంవి రమణారెడ్డి, శామీర్ పేట, అలియాబాద్ ఏఈలు రమేష్, శ్రీనివాస్, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ నిషేధంపై... స్థానిక సత్రాల వారితో సమావేశం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీశైలక్షేత్రపరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం దేవస్థానం అటవీశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా కార్యనిర్వహణాధికారి శ్రీ డి. పెద్దిరాజు స్థానిక సత్రాల వారితో ప్లాస్టిక్ నిషేధంపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సత్రాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు సత్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కార్యనిర్వహణాధికారి ప్లాస్టిక్ నిషేధం అమలుకు స్థానిక సత్రాల వారు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ విషయమై సత్రాలలో వసతి పొందే భక్తులకు సత్రయాజమాన్యాలు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా సత్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా ఈ విషయమై పూర్తి అవగాహనను కల్పించాలన్నారు. అన్ని సత్రాల వారు కూడా విడివిడిగా రెండు చెత్త కుండీలను ఏర్పాటు చేసుకుని తడిచెత్తను. పొడిచెత్తను వేరువేరుగా ఆయా చెత్తకుండీలలో వేయాలన్నారు. దేవస్థానం పారిశుద్ధ్య సిబ్బంది వీటిని సేకరించి డంప్ యార్డుకు తరలించడం జరుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ దేవస్థాన పరిధిలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ స్పూన్లు, ప్లాస్టిక్ ఫోర్కులు, ప్లాస్టిక్ కప్పులు మొదలైన వాటిని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళ స్థానంలో మట్టి లేదా స్టీలు లేదా రాగి సీసాలను వినియోగించాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ క్యారీబ్యాగులకు బదులుగా కాగితం, జనపనార, గుడ్డసంచులను వాడాలన్నారు. ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో అరటిఆకులు, విస్తరాకులు, వక్కచెట్ల బెరడుతో చేసిన ప్లేట్లు మొదలైనవాటిని వినియోగించవచ్చునన్నారు.
భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం పలుచోట్ల మొత్తం 30కి పైగా ఉచిత వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఈ విషయమై దేవస్థాన ప్రసార వ్యవస్థ ద్వారా మరియు క్షేత్రపరిధిలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన బోర్డుల ద్వారా స్థానికులలోనూ, భక్తులలోనూ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను ఎంతో వివరంగా తెలియజేశారు. పర్యావరణాన్ని తీవ్రంగా కలుషితం చేసే వాటిలో ప్లాస్టిక్ వినియోగం ఒకటని అన్నారు. ప్లాస్టిక్ నీటి సీసాలు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పళ్ళాలు మొదలైన వాటిని వాడి విచ్చలవిడిగా పడివేయడం వల్ల అవి నేల కాలుష్యానికి, నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయన్నారు. భూమిలో కలిసిపోని ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు భూగర్భజలాలపై కూడా తీవ్ర ప్రభవాన్ని చూపిస్తాయన్నారు. మిగిలిపోయిన ఆహారం లేదా ఇతర వ్యర్థ పదర్థాలతో కలిసిపోయిన ప్లాస్టిక్ సంచులను జంతువులు తినడం వలన అవి జబ్బుల బారిన పడుతాయన్నారు. ఒక్కొక్కసారి అకాల మరణాన్ని కూడా పొందుతాయన్నారు. వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులను సరిగ్గా పారవేయకపోవడం వలన అది మురుగునీటి వ్యవస్థలో పడి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతాయన్నారు. దాంతో అపరిశుభ్రవాతావరణం ఏర్పడి రోగకారకమైన సూక్ష్మక్రీములు ప్రబలుతాయన్నారు. ప్లాస్టిక్ పునర్వినియోగసమయంలో ఉత్పత్తి అయ్యే విషపూరిత ఆవిరి తీవ్రమైన కాలుష్యాన్ని కలిగిస్తుందన్నారు.

# ఏపీలో రీపోలింగ్‌కు అవకాశమేలేదు

## - సీఈవో ముఖేష్ కుమార్ మీనా

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ భారీ స్థాయిలో నమోదయిందని, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పలుచోట్ల 2గంటల వరకు పోలింగ్ కొనసాగినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానా ధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈ నేపథ్యంలో సీఈఓ బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించి పోలింగ్ వివరాలను వెల్లడించారు. 3500 కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలు దాటాక కూడా పోలింగ్ కొనసాగిందని చెప్పారు. ఆఖరి పోలింగ్ కేంద్రంలో రాత్రి 2 గంటలకు పోలింగ్ ముగిసినట్లు తెలిపారు. మొత్తంగా 81.86 పోలింగ్ నమోదైనట్లు స్పష్టం చేశా రు. ఇందులో ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం నమోదయినట్లు తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందన్నారు. 2014లో 78.41 శాతం, 2019లో 79.77 శాతం నమోదైందని చెప్పారు. ఇక ఈ ఎన్నికల్లో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదైతే, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదయి నట్లు తెలిపారు. పలు చోట్లు హింసాత్మక ఘటనలు నెలకొన్నాయని, వాటిపై చర్యలు తీసుకుంటా మన్నారు. ఆయా నియోజక వర్గాల్లో చెదురుమదురు ఘటనలు తప్పా, ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింద న్నారు. రీపోలింగ్ ఫిర్యాదులేవీ రాలేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీఎం లన్నిటినీ 350 స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామ న్నారు. ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడుతాయని సీఈవో మీనా తెలిపారు.

# యాదాద్రి పవర్ ప్లాంట్ ట్రైల్ రన్ సక్సెస్

భువనగిరి %-% గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో చారిత్రక ఘటం ప్రారంభమైంది. పవర్ ప్లాంట్?లో అధికారులు నేడు ట్రయల్ రన్ నిర్వహించారు. చివరి దశకు చేరుకున్న ప్లాంట్ పనులతో రెండు యూనిట్లలో ఫేజ్ -1 కింద టీఎస్ జెన్కో విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించి విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేసింది. త్వరలో దశలవారీగా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి గ్రిడ్?కు అనుసంధానం చేయనున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా మూడు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో అధికారులు పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. ఇందులో భాగంగానే మొదటి, రెండవ యూనిట్లలోని యాక్సిలరీ బాయిలరల్లో లైట్ అప్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. బొగ్గుకు ప్రత్యామ్నాయంగా ఇంధనాన్ని ఉపయోగించి అధికారులు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. 275 మీటర్ల ఎత్తు గల చిమ్నీ ద్వారా వాయును విడుదల చేశారు. ట్రయల్ రన్ లో భాగంగా ప్రాథమిక పరీక్షలను పూర్తి చేసినట్లు జెన్కో అధికారులు చెబుతున్నారు. ఈ ట్రయల్ రన్ లో టీఎస్ జెన్కో సిఎండి రిజ్వీ పాల్గొన్నారు. ఇది ఇలా ఉంటే, నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 2015లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో సూపర్ క్రిటికల్



టెక్నాలజీతో నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. ఒక్కో యూనిట్?లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. పవర్ ప్లాంట్ నిర్మాణం అనుకున్న గడువుకన్నా రెండేళ్లు ఎక్కువ కావడంతో అంచనా వ్యయం రూ. 29,500 కోట్ల నుంచి రూ. 34,500 కోట్లకు పెరిగింది. తాజాగా పవర్ ప్లాంట్ అంచనా వ్యయం రూ. 50 వేల కోట్లకు చేరింది. యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణంలో పర్యావరణ ఉల్లంఘనలో జరిగాయని రెండు స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి)కి ఫిర్యాదు చేశాయి. దీంతో ఎన్జీటి యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి పర్యావరణ అనుమతులను నిలిపివేసింది. దీంతో ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో రాష్ట్ర అధికారులు గత ఏడాది నవంబర్ 8న మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలను కేంద్రానికి పంపారు. వీటిని పరిశీలించిన నిపుణుల మదింపు కమిటీ ప్లాంటు రెండో దశ నిర్మాణానికి అనుమతులను సిఫార్సులను చేసింది. కొన్ని షరతులతో కూడిన అనుమతిని పర్యావరణ శాఖ మంజూరు చేసింది. దీంతో పవర్ ప్లాంట్ పనులను జన్?కో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. విద్యుత్ ఉత్పత్తికి ఏటా అవసరమయ్యే 3.5 టీఎంసీల నీటిని టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి తరలించేందుకు 22 కిలోమీటర్ల మేర చేపట్టిన పైపు లైన్ పనులు, రిజర్వాయర్ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. విద్యుత్ ఉత్పత్తికి కావలసిన బొగ్గును దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వేస్టేషన్ నుంచి యాదాద్రి థర్మల్ ప్లాంట్ వరకు 8.5 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ కూడా నిర్మిస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి.

## ఐదు నెలల్లోనే విద్యుత్ వ్యవస్థను కుప్ప కూల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం - మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్:** కరెంట్ కోతల విషయంలో సీఎం రేవంత్ తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతి పక్షాలు, విద్యుత్ ఉద్యోగుల మీద అభాండాలు మోపడాన్ని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విద్యుత్ రంగ వైఫల్యాలకు నేనే బాధ్యుడిని అన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వైఖరి ఆడరాక పాత గజ్జెలు అనే సామెతను గుర్తు చేస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు.. విద్యుత్ ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించిందని.. రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిందని గుర్తు చేశారు. కేవలం ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను కుప్ప కూల్చిందని.. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయే విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తమ చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగులను చీటికి మాటికి నిందించడం, చర్యలు తీసుకోవడం వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు.విద్యుత్ ఉద్యోగులపై నెపం నెట్టడమే తప్ప కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి సీఎంకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీఎం ఇలాంటి చిల్లరమల్లర చేష్టలు మాని కేసీఆర్ హయాంలో రెప్ప పాటు కూడా పోని విధంగా 24 గంటల విద్యుత్‌ని ఇచ్చినట్టుగా అన్ని రంగాలకు సరఫరా చేస్తే మంచిదన్నారు. తన లాగే అందరూ కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతారని సీఎం భ్రమల్లో ఉన్నట్టున్నారని.. వాటిని వీడి పాలన పై దృష్టి పెడితే మంచిదంటూ చురకలంటించారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**మెట్ పల్లి:** ఋతుపవనాలు ప్రవేశిస్తున్న దృష్ట్యా ముందస్తు విద్యుత్ ఫీడర్ల నిర్వహణలో భాగంగా మెట్పల్లి సబ్ డివిజన్ పరిధిలో వివిధ 33కెవి ఫీడర్లకు విద్యుత్ సరఫరా లో అంతరయాలు ఉంటాయని మెట్ పల్లి ఏడిఈ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరా కొరకు మెట్ పల్లి సబ్ డివిజన్ పరిధిలో గల వివిధ 33 కెవి లైన్ ల కింద పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించడానికి మరియు వంగిన స్తంభాలు, వేలాడే లైన్లు సరిచేయడానికి, తెగిన స్టే వైరు సరిదిద్దడానికి ఈనెల17న జగ్గసాగర్, వెల్లుల్ల సబ్ స్టేషన్లు, 18న కోనరావుపేట వేంపేట, చెవులమద్ది, మెట్పల్లి టౌన్, 19న ఆత్మకూర్, 20న మేడిపల్లి పడమర, వెంకటరావుపేట, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్, అమ్మక్కపేట, డబ్బా వాటర్ గ్రిడ్ సబ్ స్టేషన్ లకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడనున్నదనికావున వినియోగదారులు సహకరించాలని ఏడిఈ కోరారు..

## అంతరించిపోతున్న కళలను కాపాడాలి..

**– గ్రామీణ జానపద కళాకారులను ప్రోత్సహించాలి**

**– బీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్**


**జడ్చర్ల:** అంతరించిపోతున్న కళలను కాపాడాలని, గ్రామీణ జానపద కళాకారులను ప్రోత్సహించాలని, బీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు.జడ్చర్లమండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో శ్రీకృష్ణ కళామండలి సభ్యుల సమావేశంలోబీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతుశ్రీకృష్ణ కళామండలి ఆధ్వర్యంలో చిరుతల శ్రీ మార్కండేయ విలాసం వీధి నాటకాన్ని గురువారం నాడు బూరుగుపల్లిగ్రామంలోప్రదర్శిస్తున్నట్లు బీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి యాదవ్ తెలిపారు. అంతరించిపోతున్న కళలను కాపాడాలన్న ఉద్దేశంతోనే శ్రీకృష్ణ కళామండలి గ్రామీణ జానపద కళాకారులను ప్రోత్సహిస్తు భావితరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను చేరువ చేయిస్తున్నామని తెలిపారు,, మండల పరిసర గ్రామాలలోని, కళాకారులు, ప్రజలు, అధిక సంఖ్యలో హాజరై మార్కండేయ విలాసం వీధి నాటకాన్ని తిలకించివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాచీన కళలకు జీవం పోస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పంతులుగోరంట్ల మల్లేష్, మాజీ ఇంచార్జి సర్పంచ్ కృష్ణ కుమార్,గొడుగు శంకరయ్య,మేడిపూరి పెద్ద నర్సిములు, గోరంట్ల, రాంకొండ,చెన్న కేశవులు రామస్వామి, సత్యయ్య,జంగయ్య దుర్మయ్యశ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు

## అనంతపురం జిల్లాలో దారుణం.. వైసీపీకి ఓటు వేసిందన్న కోపంతో కన్న తల్లి హత్య

**అమరావతి:** అనంతపురం జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. వైసీపీకి ఓటు వేసిందన్న కోపంతో ఓ ప్రబుద్ధుడు కన్న తల్లిని హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ విషాదకర సంఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండలం ఎగువపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ఎగువపల్లి గ్రామానికి చెందిన వడ్డే సుంకమ్మకు(45) కుమారుడు వడ్డే వెంకటేశులు ఉన్నాడు. అతడు తెలుగుదేశంలో పార్టీలో పని చేస్తున్నట్లు సమాచారం.కాగా, సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేశానని మాటల సందర్భంలో సుంకమ్మ కొడుకుకు తెలిపింది. దీంతో కోపంతో ఊగిపోయిన వెంకటేశులు మద్యం సేవించి ఇంటికి వచ్చి తల్లితో గొడవకి దిగాడు.

మాటమాట పెరిగి క్షణికావేశంలో కన్నతల్లి తలపై ఇనుప సుత్తితో బాది హత్య పరారయ్యాడు. సమాచారం అందుకున్న కంబ దూరు పోలీసులు హత్య జరిగిన ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. పరారీలో ఉన్న వడ్డే వెంకటేశులు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఇజ్రాయెల్ డొల్లతనాన్ని బైటపెట్టే యూదు ప్రతిఘటన



గత కొన్ని వారాలుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న నరమేధం ఆపాలని భిన్న జాతుల, మతాల, దేశాల విద్యార్థులు, భారతీయ సంతతి విద్యార్థులతో సహా, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో తీవ్ర నిరసనలు జరుపుతున్నారు. దాదాపు 120కి పైగా విశ్వవిద్యాలయాల్లో టెంట్లు వేసుకుని తమ విశ్వవిద్యాలయాల పాలక మండళ్లు ఇజ్రాయెల్‌కి చెందిన లేక సంబంధమున్న కంపెనీలలో పెట్టిన పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, ఆయా లాభాలని వాడుకోవటం అది జరుపుతున్న నరమేధంలో పాలు పంచుకున్నట్లేనని వారు వాదిస్తున్నారు. ఇవే నిరసనలు ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లలో కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల వీధుల్లో కొన్ని నెలలుగా జరుగుతున్న నిరసనలకు ఇవి కొనసాగింపు. ఈ నిరసనల్లో ప్రధాన అంశం %-% ఇజ్రాయెల్‌కు, జయోనిజానికి (అంటే యూదు మత రాజ్య భావనకు) వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యూదులు పోషిస్తున్న కీలక పాత్ర. అక్టోబర్ 7న హమాస్ దాడుల తర్వాత, ప్రపంచ వ్యాప్తంగా జయోనిస్టులు, అమెరికన్ మితవాదులు, మన దేశంలో హిందూత్వ వాదులు ఇస్లామోఫోబియా (ముస్లిం ద్వేషం) అనే మౌలిక భూమికపైన ఏకమై పాలస్తీనా ప్రజల స్వతంత్ర ఆకాంక్షకు, వారి ప్రతిఘటనకు వ్యతిరేకంగా ఉధృతమైన ప్రచారం ప్రారంభించారు. దీని సారాంశం వందేళ్ళ పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని హమాస్‌కు, హమాస్‌ని అక్టోబర్ 7 ఘటనకు, ఆ ఘటనని ఒక టెర్రరిస్టు చర్యకు కుదించటంబీ అలాగే 75ఏళ్ల ఇజ్రాయెల్ చేస్తూ వచ్చిన దురాక్రమణని, దౌర్జన్యాన్ని, క్రూర హింసని 'హిట్లర్ నరమేధానికి గురయిన యూదుల ఆత్మరక్షణ చర్యలు'గా అర్థం చేసుకోవాలని అందరికీ చెప్పటం. ఈ ప్రచారంలో పాలస్తీనా అరబ్బుల ప్రతిఘటన ఇస్లామిక్ టెర్రరిజంగానూ, అన్ని అంతర్జాతీయ మానవతా చట్టాలనూ ఉల్లంఘిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ 'బాధిత' సమాజంగానూ కనిపిస్తారు. అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ గాజాపై కనీ వినీ ఎరుగని రీతిలో జరిపిన నరమేధాన్ని సరయిన 'ప్రతి చర్య'గా సమర్థించటమే ఈ ఊదరగొట్టే ప్రచార ఉద్దేశం. ఇలా చెయ్యటం ఇజ్రాయెల్ పాలకులకు, దాని అమెరికన్, యూరోపియన్ సమర్థకులకు కొత్త కాదు. 1950ల నుండే వాళ్ళా ప్రచార ఆయుధాల్ని సమకూర్చుకుని, ఎప్పటికప్పుడు పదును పెట్టుకుంటూ వాడుకుంటున్నారు. దానికి కావాల్సినంత డబ్బు తమ సంస్థలు, లాబీలు, ట్రస్టుల ద్వారా వాళ్ళు ఖర్చుపెట్టి తమక్కావాల్సింది చేయించుకుంటారని 'ది ఇజ్రాయెలీ లాబీ' అనే పుస్తకం రాసిన అమెరికన్ యూదు విదేశాంగ విధాన నిపుణులు 2006లోనే బయటపెట్టారు. ఇజ్రాయెల్ తన దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా పిల్లలకి స్కూళ్లు స్థాపించి వాటిల్లోనూ, ప్రపంచ వ్యాప్తంగా యూదు యువతకి తన సైన్యంలోకి ఆహ్వానించి ట్రైనింగ్‌లో భాగంగా ఈ ప్రాపంచిక దృక్పథాన్ని బాగా నూరిపోస్తూ ఉంటుంది. ప్రపంచంలో యూదులు తప్ప ఇంకెవరూ నరమేధానికి గురి కాలేదని, కాబట్టి పురాణాల్లో వున్న విధంగా పాలస్తీనాపై యూదులకి తప్ప అరబ్బులకి ఏ మాత్రం హక్కులుండకూడదని, వారు వెళ్లిపోకుండా అక్కడుండటం తన అస్తిత్వానికే ముప్పని, ప్రపంచం ఎట్లా గొట్లా వారిని ఇజ్రాయెల్ నుండి వెళ్లిపోయేలా తనకి సహకరించాలని నెతన్యాహూతో సహా అనేక మంది యూదు రాజ్య భావనని మోసే యూదులు నమ్ముతారు. అసలు నరమేధం అనే మాట ఇంకెవరికీ వాడకూడదని కూడా ఈ జయోనిస్టు యూదులు వాదిస్తుంటారు. ఆఫ్రికాలో, అమెరికాలో ఐరోపా వలస రాజ్యాలు నల్ల జాతీయులు, స్థానికులు, భారతీయులపై జరిపిన అనేక మారణకాండలు, ఇంకా ఆటోమోన్ సామ్రాజ్యం రొమేనియన్లపై జరిపిన నరమేధం, రువాండాలో హుతీలు, టూట్సీలపై, అలాగే కోసోవోలో ముస్లింలపై జరిపిన మారణకాండల కంటే తమదే తీవ్రమైందని తెల్లజాతికి చెందిన ఈ జయోనిస్టు యూదులు బలంగా నమ్ముతారు. అది పునరావృతం కాకుండా ఉండాలంటే ఎంతకయినా తెగించాలి అని బలంగా నమ్మే వీళ్ళు 1948లో పాలస్తీనా నుండి స్థానిక 8 లక్షల అరబ్బులని వెళ్లగొట్టి ఆ తర్వాత వారి వ్యవసాయ భూములని స్వాధీనం చేసుకుని, వారి ప్రాంతాలని ఆక్రమించి పైగా వారి పట్ల దయ చూపకుండా జాతి వివక్ష, జాత్యహంకారంతో రెండవ శ్రేణి పౌరులుగా చూస్తూ, దాన్ని 'ఆత్మరక్షణ' పేరుతో, 'అరబ్బుల/ముస్లింల అనాగరికత, హింసాత్మకత' పేరుతో గత 75 ఏళ్లుగా సమర్థించుకుంటూ వచ్చారు. పాలస్తీనా ప్రజలు తమపై రుద్దబడిన ఈ వలస, జాత్యహంకార పాలనకి వ్యతిరేకంగా జరుపుతూ వచ్చిన పోరాటానికి వలస పాలన నుండి బయట పడిన అనేక మూడవ ప్రపంచ దేశాలు, భారతదేశంతో సహా, ఈ మధ్య వరకూ సహానుభూతి ప్రకటిస్తూనే వచ్చాయి. అమెరికాలో కూడా ఇజ్రాయెల్ సైన్యంలో పనిచేసింతర్వాత జయోనిస్టు దృక్పథం మార్చుకున్న వాళ్ళు ఒక రకమైతే, ఆఫ్రికన్ అమెరికన్ నిరసనల్లో 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్'లో పాల్గొన్న క్రమంలో పాలస్తీనా గురించి అర్థం చేసుకున్న యువత రెండవ రకం. వీళ్ళందరూ 'ఇఫ్ నాట్ నౌ' అనే సంస్థ స్థాపించి గత దశాబ్దం కాలంగా జయోనిజానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్నారు. వీళ్ళు కాకుండా యూదు మత స్ఫూర్తితో పనిచేసే సనాతన యూదులతో సహా, నరమేధం తమకే కాదు ఎవరిపైనా జరక్కూడదు అనే రాజకీయ స్పృహ వున్న యూదులతో కూడుకున్న 'జూస్ ఫర్ పీస్' అనే సంస్థ చాలా చోట్ల వ్యాపించి, అధికారంలో వుండే జయోనిస్టు యూదుల ప్రభావాన్ని తగ్గించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఐరోపాలో కూడా నవమోడ్ (ఇంగ్లాండ్) జ్యూయిష్ వాయిస్ (జెర్మనీ), ఇటువంటి సంస్థలు వచ్చాయి. అక్టోబర్ నుండి ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధం వీరిని మరింత బలోపేతం చేసి రోడ్ల మీదకి తెచ్చాయి. యూదు మతం గాని, యూదుల చరిత్ర గాని ఇతరులని అణిచివేసి, వారిని చంపేవి కాదని, ఇజ్రాయెల్ రాజ్యం చేస్తోంది ఈ రెండింటి స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకమని వీళ్ళు నొక్కి చెప్తున్నారు. న్యాయం, శాంతి, ప్రజాస్వామ్యం, జాతి వివక్ష నిర్మూలన, వలస వాద ప్రభావం, సామ్రాజ్యవాదం గురించి తరగతి గదుల్లో నేర్చుకునే యూనివర్సిటీ విద్యార్థులు వాటి కోసం పోరాటానికి దిగటం పెద్ద వింతేమీ కాదు. ఇవి బోధించే అధ్యాపకులు కూడా వీరికి మద్దతు నివ్వటం సహజమే. క్యాంపస్‌లలో యూదు విద్యార్థులు పాలస్తీనా, అరబ్బు విద్యార్థులతోనే కాక, ఆఫ్రికన్ అమెరికన్ విద్యార్థులతో కూడా కలిసి పని చేస్తున్నారు. ఆఫ్రికన్ అమెరికన్ ఉద్యమకారులు పాలస్తీనా విముక్తి కోసం జరుగుతున్న ఉద్యమంతో సంఘీభావం తెలపటం 1960ల్లోనే ప్రారంభమయినప్పటికీ, జార్జ్ ఫ్లాయిడ్ హత్య సమయంలో పాలస్తీనా ఉద్యమకారులు పోలీసులతో ఎట్లా నెగ్గుకు రావాలో సోషల్ మీడియాలో సలహాలివ్వటం తర్వాత పెరిగిందని ప్రముఖ నల్లజాతి రచయిత తా నెహిసి కోయెటీస్ చెప్తారు. ఆయన, మరికొంత మంది నల్లజాతి మేధావులు, ఉద్యమకారులు వెస్ట్ బ్యాంకుకి వెళ్లటంతో అక్కడ ఇజ్రాయెల్ పాటిస్తున్న జాతి వివక్ష, సెగ్రిగేషన్ ఈ తరం వాళ్లందరికీ అర్థమై ఈ సంఘీభావానికి దారి ఏర్పడిందని అయన అంటారు. విద్యార్థుల నిరసన శిబిరానికి వచ్చిన ఏంజెలా డేవిస్ –'1960ల నుండి నేను ఇటువంటి నిరసనల కోసం ఎదురుచూస్తున్నాను. మీరు చేస్తున్న నిరసనలు చరిత్రాత్మకమైనవి' అని చెప్పటం ఈ సంఘీభావ లోతుని తెలుపుతుంది. పాలస్తీనా కోసం జరుగుతున్న నిరసనల్లో యూదులు ముందున్నారనే పరిజ్ఞానం జయోనిస్టుల కథనాన్ని నిర్వీర్యం చేస్తుంది. పాలస్తీనా కోసం నిరసనలు 'యూదు వ్యతిరేకమైనవే' అన్న నిందకి విశ్వసనీయత లేకుండా చేస్తుంది. పాలస్తీనాలో జరుగుతోంది ముస్లిములకూ యూదులకూ జరిగే మతపరమైన యుద్ధం కాదని, యూదులూ అరబ్బుల మధ్య ఏ జన్మ వైరుధ్యం లేదని, కేవలం పాలస్తీనా వనరులపై మనుషులపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ని జాత్యహంకార రాజ్యంగా జయోనిస్టులు తయారు చేశారని బయటికి తెస్తుంది. జరుగుతున్న నరమేధానికి ఇజ్రాయెల్ కూడగట్టాలని చూస్తున్న నైతిక, ఆర్థిక బలాన్ని దెబ్బతీస్తుంది. అందువల్లే కాబోలు పద్ధతి ప్రకారం, నిర్దిష్టమైన డిమాండ్లతో, శాంతియుతంగా, యూనివర్సిటీ కేటాయించిన చోటులో జరుగుతున్న విద్యార్థి నిరసనలని అణచటానికి వారి పైకి యుద్ధానికెళ్ళే సైనికుల మాదిరి గన్నులు, బుల్‌డోజర్లతో పోలీసులని పంపించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాయి ప్రభుత్వాలు. ఈ చర్యలు ఆయా దేశాల్లో రాజకీయాలకి, పెట్టుబడిదారులకి, ఇజ్రాయెల్‌తో వున్న గాఢమైన సంబంధాన్నే గాక, జరుగుతున్న నిరసనలు యథాస్థితి వాదాన్ని ఎంత భయపెడుతున్నాయో కూడా సూచిస్తున్నాయి.

# కుటుంబ వ్యవస్థను పటిష్టం చేద్దాం

ఒక కుటుంబంలో తాత, అమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంటిలోని పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ, ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలలో పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునే ఆత్మీయులు, ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనం అనే భావన లేకుండా ఆనందంగా గడిపిన కుటుంబాలెన్నో ఉన్నాయి. కానీ నేడు చూస్తే ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కలసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ను దెబ్బ తీసింది. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 15న విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి, కుటుంబ విలువలను తెలియజేయడం కోసం, ఉమ్మడి కుటుంబాల అవసరం గురించి వివరించడం కోసం ఈ రోజును ప్రత్యేకంగా కేటాయించారు. పూర్వకాలంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడం లేదు. ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావ డం, పట్టించుకునేవారు లేకపోవడంతో విచ్చల విడిగా బతకడం, పిల్లలకు సంస్కృతి సాంప్రదాయం తెలియజేసే తాతలు, అమ్మలు లేకపోవడం, క్షణికావేశంలో నేరస్థులుకావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే నష్టాలను, తీవ్ర పరిణామాలను గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం 1993, మే 15న అంతర్జాతీయ కుంటుంబ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం అనే అంశాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యంకోసం ప్రపంచ వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను వివరించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల మధ్య తిరిగి ప్రేమానురాగాలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకోవడానికి నిర్ణయించింది. కుటుంబ సమైక్యత గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, కుటుంబ పెద్దల నైపుణ్యాన్నీ, అనుభవాలను పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో ఈ రోజును జరుపుకుంటున్నాము. కుటుంబ వ్యవస్థ మన సమాజం మనకు ఇచ్చిన ఒక గొప్ప అరుదైన కానుకగా భావించవచ్చు. కుటుంబం అనేది సమాజంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ ప్రత్యేకత



కారణంగా కుటుంబం వ్యక్తిని జాతికి అనుసంధానం చేస్తూ వసుధైక కుటంబం అనే దిశలో ప్రయాణానికి తోడ్పడుతున్నది. సామాజిక, ఆర్థిక భద్రతకు ఒక సంపూర్ణ వ్యవస్థ కావడంతో పాటు, కొత్త తరానికి సంస్కారాలు, విలువలు నేర్చే ముఖ్యమైన మాధ్యమంగా కూడా కుటుంబం వ్యవహరిస్తుంది. కుటుంబ వ్యవస్థ వల్ల సమాజానికి మనం ఇచ్చే సందేశం ఎంతో గొప్పది. ప్రపంచ దేశాల్లో భారత దేశ కుటుంబ వ్యవస్థలా మరెక్కడా లేకపోవడం అనేది మన ధర్మం గొప్పతనంగా భావించవచ్చు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, నాగరికత అభివృద్ధికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. పూర్వకాలం నుండి మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని చరిత్ర ద్వారా మనకు తెలిసిందే. మన దేశంలో ఉమ్మడి కుటుంబాల వారు ఆనందంగా ఉన్నారని మన చరిత్ర ద్వారా మనం తెలుసుకున్న నిజం. ఒక కుటుంబంలో తాత, అమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంటిలోని పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ, ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలలో పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునే ఆత్మీయులు, ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనం అనే భావన లేకుండా ఆనందంగా గడిపిన కుటుంబాలెన్నో ఉన్నాయి. కానీ నేడు చూస్తే ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కలసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ను దెబ్బ తీసింది. నేటి ఆధునిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించలేని పరిస్థితి నెలకొంది. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం లేదంటే మన కుటుంబ వ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం చేసుకోవచ్చు. అందరూ డబ్బు సంపాదించే యంత్రాలుగా మారి, తల్లి దండ్రులను చూసుకొనే తీరికలేక వృద్ధాశ్రమాలలో వేస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలలో కలిసిమెలిసి ఉండే మనసులు కానీ, మనుషులు కాని లేక, పెళ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకొని ఒంటరై పోతున్నారు. సలహాలు సూచనలు ఇచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు ఉండక, జీవితమంటే విసుగు వచ్చే స్థాయికి నేటి యువత వెళ్లిందంటే కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకుంటూ, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కుటుంబ వ్యవస్థ ముఖ్యోద్దేశాలు పిల్లలకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, సంస్కృతిని వారికి అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంగా ఉండాలి. ఆడవారు, మగవారు వేరు వేరు పనులు పంచుకొని జీవనాన్ని సాగిస్తూ శ్రమవిభజనకు ఒక ఉదాహరణగా ఉంటుంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం దొరకని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా ఉన్నాయంటే విచారకరం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మన దేశం పుట్టిల్లు. ఇప్పుడు అలాంటి ఉమ్మడి కుటుంబాలున్న వారిని వెతికినా దొరకడం లేదు.

# అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ముందంజ.....





అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ప్రెసిడెంట్ జో బైడెన్ కన్నా.. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ముందంజలో ఉన్నారు.న్యూయార్క్ టైమ్స్, సియానా కాలేజ్, ఫిలడెల్ఫియా ఎంక్వైరర్ పోల్ సర్వేలో ముందంజలో నిలిచారు. ఆరు కీలక రాష్ట్రాల్లో సర్వే నిర్వహించారు. ఐదింటిలో ట్రంప్ ముందంజలో ఉండగా.. జోబైడెన్ మాత్రం కేవలం ఒక స్టేట్ లోనే ఆధిక్యంలో ఉన్నట్లు తెలిసింది. పెన్సిల్వేనియా, మిషిగన్, అరిజోనా, జార్జియా, నెవడా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు సాధించిన వాళ్లకే అధ్యక్ష పీఠం దక్కే అవకాశం ఉంటుంది. ఈ ఆరు స్టేట్స్లో న్యూయార్క్ టైమ్స్, సియానా కాలేజ్ పోల్స్, ఫిలడెల్ఫియా సంస్థలు సర్వేలు చేపట్టాయి. దీంతో పెన్సిల్వేనియా, మిషిగన్, అరిజోనా, జార్జియా, నెవడాలో ట్రంప్ ముందంజలో నిలిచారు. జో బైడెన్ కేవలం విస్కాన్సిన్ స్టేట్లోనే స్వల్ప ఆధిక్యాన్ని ప్రదర్శించారు. మొత్తం ఆరు రాష్ట్రాల్లో 2020లో బైడెన్ వైపే ప్రజలు మొగ్గు చూపారు. కానీ, ఈ సారి మాత్రం పరిస్థితి విభిన్నంగా ఉంది. మార్చిలో ఇచ్చిన స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగం తరువాత బైడెన్ కు మద్దతు పెరిగింది.

## జీవన్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

**– ఆరు గ్యారంటీలు అమలు చేశామని చెప్పడం సిగ్గచేటు**

**– బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**

**జగిత్యాల:** రాష్ట్రంలో కాంగ్రెస్ కు వచ్చిన ఆదరణ చూడలేక మొన్న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి ఓట్లు వేయించిందని కాంగ్రెస్ నిజామాబాద్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, ఆదరాక పందిరి కురచ అన్న చందంగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. బుధవారం జిల్లాలోని పెగడపల్లి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూఅయిదు నెలల పాలనలో ఆరు గ్యారంటీల విషయంలో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని ప్రజలను నమ్మించే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేసిందని ప్రజలు ఎవరు దానిని నమ్మలేదని నరేంద్ర మోడీ పరిపాలన విషయంలో రాజ్యాంగానికి లోబడి పని చేస్తారనే విషయం ప్రజల లోపల బలంగా నాటుకుపోయిందని అన్నారు. ప్రతి ఇంట్లో పదేళ్ల వయసు పిల్లలు కూడా మోడీ తాతయ్యకే ఓటయ్యాలని మారాం చేసి కుటుంబ సభ్యులను ఒప్పించి మరి ఓటేయించారని అన్నారు. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రాజకీయ లబ్ధికోసం మత విద్వేషాలు రెచ్చగొట్టలేదని 370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ రద్దు, రామ మందిరం నిర్మాణం విషయంలో ముస్లిం వర్గం మెప్పు కోసం హిందూ సమాజాన్ని రెచ్చగొట్టిన వ్యక్తి జీవన్ రెడ్డి అని అన్నారు. 80 శాతం ఉన్న హిందువులను, సనాతన ధర్మాన్ని,రామున్ని రాముని ఆస్తిత్వాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రశ్నించడం వల్లనే హిందువులు సంఘటన శక్తిని చాటారన్న విషయం కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవాలని అన్నారు. రాముడు ఉంటే గుండెల్లో ఉండాలి కానీ గోడల మీద కాదు అన్న జీవన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రజలు నిజం చేశారని అందుకే గుండెల్లో ఉన్న భక్తిని చాటుకోవడానికి ప్రజలు బీజేపీకి ఓటేశారనే విషయం కాంగ్రెస్ పార్టీ గుర్తెరగాలని అన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పలు ఎన్నికల్లో పని చేశాయని గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరారని ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని అందుకే కాంగ్రెస్,బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలు బలంగా విశ్వశించారని అందుకే బీజేపీకి ఓటేశారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు పల్లె మోహన్ రెడ్డి, పెంట నరేందర్, మండల నాయకులు వరద రాము, మూడపెల్లి తిరుపతి, కాశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రఫాలో ఇజ్రాయిల్ దాడులు ఉధృతం...!



గాజా : గాజాలోని ఉత్తర, దక్షిణ, సెంట్రల్ ప్రాంతాల్లో రాత్రిపగలు అనే తేడా లేకుండా ఇజ్రాయిల్ బలగాలు వైమానిక దాడులు కొనసాగిస్తున్నాయి. ఉత్తర గాజాలోని జాబాలియా శరణార్థుల శిబిరం వున్న ప్రాంతంలోకి, రఫా నగరంలోకి ఇజ్రాయిల్ బలగాలు, ట్యాంకులు చొచ్చుకుపోయాయి. అక్కడ రాత్రంతా ఉధృతంగా వైమానిక దాడులు కొనసాగిన తర్వాత సోమవారం ఉదయం నుండీ మిలటరీ దాడులు మొదలయ్యాయి. గడచిన 24 గంటల్లో 57మంది మరణించగా, 82మంది గాయపడ్డారు. ఇప్పటివరకు దాదాపు 3,60,000మంది పాలస్తీనియన్లు రఫా నగరాన్ని వీడి వెళ్లిపోయారని ఐక్యరాజ్య సమితి వర్గాలు పేర్కొన్నాయి. రఫా నుండి ఖాన్ యూనిస్ నగరానికి ప్రజలు బారులు తీరి వెళ్లడం కనిపిస్తోంది. ఏప్రిల్ 3 నుండి మే 8 మధ్యలో ఉపగ్రహ ఛాయాచిత్రాలను పరిశీలించినట్లైతే పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థమవుతోంది. జాబాలియా శరణార్థ శిబిరంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని పాఠశాలలు నిర్వాసితులకు నెలవుగా మారాయి. శిబిరాలు వేసుకుని కూడా వేలాదిమంది ప్రజలు నివసించేవారు సోమవారం ఉదయం ఇజ్రాయిల్ సైనిక బలగాలు అక్కడ నుండి బలవంతంగా వందలాదిమంది నిర్వాసితులను ఖాళీ చేయించాయి. అక్కడ నుండి పశ్చిమ దిశగా వందల సంఖ్యలో కుటుంబాలు వెళ్లడం కనిపిస్తోందని ఇదంతా చిత్రీకరించిన అల్‌జజీరా మీడియా తెలిపింది. రఫా నగరంలోని కువైట్ ఆస్పత్రి నుండి వైద్య సిబ్బందిని వెళ్లిపోవాల్సిందిగా బలగాలు ఆదేశించాయి. దాంతో మరికొద్ది గంటల్లో గాజావ్యాప్తంగా ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలడం ఖాయమని గాజా ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించారు.

## ముంబయిలో ఈదురుగాలులు వాన బీభత్సం..!



**ముంబయి :** ముంబయిలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఘాట్‌కోపర్‌లో ఘోర విషాదం ఏర్పడింది. ఈదురుగాలుల ధాటికి 100 అడుగుల ఎత్తయిన భారీ ఇనుప హోర్డింగ్ కూలి 14 మంది మృతి చెందారు. 100మంది వరకు గాయపడ్డారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతుండటంతో.. మృతుల సంఖ్య పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. నిన్న సాయంత్రం 4 గంటల 30 నిముషాల సమయంలో ఈదురుగాలుల ధాటికి ఘాట్‌కోపర్‌లోని సమతా నగర్‌లో భారీ హోర్డింగ్ కూలి రైల్వే పెట్రోల్ పంపుపై పడింది. సమాచారం అందుకున్న రెస్క్యూ టీంలు రంగంలోకి దిగాయి. హోర్డింగ్ కింద చనిపోయిన 14 మంది మృతదేహాల్ని వెలికితీశాయి. కూలిన హోర్డింగ్ కింద ఇంకా పలువురు చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. ఈ హోర్డింగ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకోలేదని ముంబయి నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. దాదర్, కుర్లా, మాహిమ్, ఘాట్‌కోపర్, ములుండ్, విక్రోలి, దక్షిణ ముంబయిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం తేలికపాటి వర్షంతోపాటు, బలమైన ఈదురు గాలులు వీచాయి. కొన్నిచోట్ల దట్టంగా దుమ్ము ఎగసిపడింది. వడాలాలోని బర్కత్ అలీ నాకాలో శ్రీజీ టవర్ సమీపంలో వడాలా–అంటోప్ హిల్ రోడ్డులో సాయంత్రం నాలుగు గంటలకు నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ రోడ్డుపై కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎనిమిది వాహనాలు ధ్వంసమయ్యాయి. వర్షం, ఈదురుగాలి కారణంగా అనేక ప్రాంతాల్లో స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల వైర్లు తెగిపడ్డాయి. పలు మార్గాల్లో మెట్రో సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. సెంట్రల్ రైల్వే రెండు గంటలకుపైగా లోకల్ రైలు సేవలను నిలిపివేసింది. అనేక చోట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ముంబయి విమానాశ్రయంలో దృగ్గోచరత పడిపోవడంతో గంటా ఆరు నిమిషాల పాటు విమానాల రాకపోకలను నిలిపివేశారు. సుమారు 15 విమానాలను దారి మళ్లించారు. సాయంత్రం 5.03 గంటలకు రన్‌వే కార్యకలాపాలను పునరుద్ధరించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం



**జకార్తా :** ఇండోనేషియాలోని మారుమూల ద్వీపమైన హల్మాహెరాలో మౌంట్ ఇబూ అగ్నిపర్వతం సోమవారం ఉదయం బద్దలైంది. ఆకాశంలోకి దాదాపు 5కిలోమీటర్ల ఎత్తున బూడిదను వెదజల్లుతోందని దేశ అగ్నిపర్వతాలు, భూకంపాల అధ్యయన కేంద్రం వెల్లడించింది. ఈ నెల 10వ తేదీన కూడా ఇదే రీతిలో బూడిద విరజిమ్మిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అగ్నిపర్వతానికి 5కిలోమీటర్ల పరిధిలో ఏ విధమైన కార్యకలాపాలు చేపట్టరాదంటూ నిషేధం విధించారు. బూడిద వర్షంలా వెదజల్లడం ఆరంభమైనందున సమీప ప్రాంతాల ప్రజలు మాస్కులు, గ్లాస్‌లు ధరించాలని కోరారు. అగ్నిపర్వతం చీలికల నుండి బూడిద రావడంతో పాటు శబ్దాలు కూడా వస్తున్నాయని చెప్పారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ మీద వున్న ఇండోనేషియాలో 127 క్రియాశీలంగా వున్న అగ్నిపర్వతాలు వున్నాయి. ఇటీవలివారాల్లోనే ఉత్తరు సులవేశి ప్రాంతంలో రువాంగ్ అగ్నిపర్వతం బద్దలైంది. పెద్ద మొత్తంలో లావా, బూడిదను విరజిమ్మంది. గత డిసెంబరులో మారాపి అగ్నిపర్వతం బద్దలైన ఘటనలో 20మందికి పైగా మరణించారు.

## భారత్–ఇరాన్ ఒప్పందం.. ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా.....!



ఇరాన్‌తో భారత్ ఒప్పందాలపై అమెరిగా గుర్రుగా ఉంది. చాబహార్ పోర్టు నిర్వహణపై భారత్, ఇరాన్ మధ్య పదేళ్ల కీలక ఒప్పందం జరిగింది. ఒప్పందం జరిగిన కొన్ని గంటలకే.. భారత్ ను పరోక్షంగా హెచ్చరించింది అమెరికా. ఇరాన్ తో ఒప్పందాలు జరిపే ఎవరిపైన అయినా ఆంక్షలు విధించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ప్రతినిధి వేదాంత్ పటేల్ ఈ డీల్ గురించి మీడియాతో మాట్లాడారు. చాబహార్ పోర్టు నిర్వహణ కోసం భారత్– ఇరాన్ ఒప్పందం గురించి తెలిసిందన్నారు. ఇరాన్ తో ద్వైపాక్షిక సంబంధాలు, విదేశాంగ విధానాలపై భారత్ సొంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. అయితే, ఇరాన్ పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించిందని.. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇరాన్ తో ఎవరైనా బిజినెస్ డీలింగ్స్ జరిపితే.. వారిపైనా ఆంక్షలు పడే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని మరోసారి చెప్తున్నామన్నారు. ఇకపోతే, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్యం జరిపేందుకు భారత్ కు ప్రధాన మార్గం చాబహార్ పోర్టు. కజకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్కెమెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ నుంచి సరకు రవాణా చేయవచ్చు.

## కుటుంబమే కదా స్వర్గసీమ!


భూకుగ్రామానికి పునాదులు కుటుంబాలు. వసుదైక కుటుంబ సౌభాగ్యానికి సకల మూలాలు కుటుంబాలు. అమ్మనాన్నలు, కుటుంబం లేని వారుండరు. కుటుంబం అంటే నాలుగు గోడల నడుమ ఉన్న గదులు కాదు. ప్రేమానురాగాల సిమెంటుతో కట్టిన పొదరిల్లు. కుటుంబం అంటే నవ్వులు, అనుబంధాలు, ఆప్యాయతలు, బాధలు, బాధ్యతలు, హక్కులు, సంతోషాల కుప్పలు, గాయాలకు లేపనాలు, సవాళ్ళకు సమాధానాలు, శారీరక మానసిక వికాస సోపానాలు, కష్టసుఖాల సమతుల్యతలు, అమ్మ లాలనలు, నాన్న నిర్దేశాలు, సమాజాభివృద్ధికి మూల స్తంభాలు. నాటి నుంచి నేటి వరకు కుటుంబాలు కాలక్రమంలో పెను మార్పులకు లోనవుతూ ఉన్నప్పటికీ కుటుంబానికి ప్రత్యామ్నాయం లేదు. ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తూ న్యూక్లియర్ ఫామిలీలు వెలుస్తున్నాయి. డిజిటల్ యుగంలో కుటుంబం అంటే అమ్మనాన్న, ఒకరిద్దరు పిల్లలుగా కుచించుకు పోయింది. నాన్న నాయకత్వం, అమ్మ అమృత హస్తం నీడన ఎదిగిన పిల్లలు జాతిరత్నాలు అవుతారు. అమ్మనాన్ననలను గౌరవించక, అపహాస్యం చేసే పిల్లలు చరిత్ర హీనులు అవుతారు. ఆది గురువులుగా తల్లితండ్రులు పిల్లల మనసుల్లో మానవీయ విత్తులు నాటుతారు. సంతోషాలతో నిండిన గృహాలు దేశాభివృద్ధికి గీటురాళ్ళు. అస్థిర కుటుంబాలు అశాంతికి నెలవులు. సమాజ దేహానికి కుటుంబాలే అస్థిపంజర పటిష్ట వ్యవస్థలు, కుటుంబ సభ్యులే అవయవాలు. ఇండియాలో పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ నెలకొని ఉంటూ ఆర్థిక స్థితిని బట్టి ధనిక, మధ్య తరగతి, పేదరిక కుటుంబాలుగా వర్గీకరించబడి ఉన్నాయి. ప్రపంచ మానవాళి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1994లో 'అంతర్జాతీయ కుటుంబ దినం (ఇంటర్నేషనల్ ఫామిలి డే)'ను ప్రతి ఏటా 15 మే రోజున పాటించుటకు నిర్ణయం తీసుకుంది. సమాజానికి యూనిట్ కుటుంబమని, కుటుంబ అభివృద్ధే సమాజ అభివృద్ధిని నమ్మిన ఐరాస ప్రతి ఏటా ఒక ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవాన్ని జరుపుకొనుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కుటుంబ దినం – 2024 నినాదంగా 'విభిన్న ఆలోచనలతో కుటుంబాల బలోపేతం (ఎంబ్రేసింగ్ డైవర్సిటీ, స్ట్రేందెనింగ్ ఫామిలీస్)' అనే అంశాన్ని తీసుకున్నారు. తల్లితండ్రులు తమ పిల్లల సమగ్రాభివృద్ధికి జీవితాలను ధార పోస్తారు. చిన్నారుల శారీరక మానసిక విలాసానికి కుటుంబ వాతావరణం దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అవిద్య, నిరుద్యోగాల వంటి సవాళ్ళను అధిగమించడానికి కుటుంబ వ్యక్తులు ప్రధాన కారకులు అవుతారు. కుటుంబ అభివృద్ధికి సాంఘీక, ఆర్థిక, జనాభా లాంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. కుటుంబాన్ని బలీయం చేసినపుడు సమాజం నెలకొన్న అన్ని సమస్యలు సమిసిపోతాయి. కుటుంబ సభ్యుల్లో అమ్మనాన్నల మధ్య బంధం, పిల్లలతో ప్రేమానురాగాల సంబంధం, పిల్లల మధ్య సోదర రక్తసంబంధాలు పటిష్టంగా నెలకొని ఉంటాయి. అంతర్జాతీయ కుటుంబ దినం వేదికగా వ్యక్తి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను వివరించడం, కుటుంబ సభ్యులు కలిసి ఆటపాటలతో సంతోషంగా గడపడం, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం లాంటివి పాటిస్తారు. సమాజాభివృద్ధికి కుటుంబమే సోపానంగా నిలుస్తుంది. కుటుంబ విచ్ఛిన్నంతో కుటుంబ సభ్యుల మనసులు విరిగినట్లు భావించాలి. ఉన్నత విలువలు, సామాజిక సంఘీభావాలకు కుటుంబ వ్యవస్థ అతి ప్రధానమైనది. కుటుంబాల ప్రగతికి ప్రభుత్వాలు కూడా ప్రధాన భూమికను నిర్వహించాలి. భారతీయ కుటుంబ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల సంస్కృతి ప్రధానమైనది. ఒకే కుటుంబంలో 3 – 4 తరాల సభ్యులు (తాతలు, బామ్మలు, బాబాయిలు, పిన్నులు, మనుమలు, మనుమరాండ్రు, సోదర సోదరీమణులు, బావలు, మరదులు లాంటి సమీప సంబంధీకులు) ఒకే గొడుగు కింద కుటుంబ సభ్యులుగా జీవించగలగడం ఓ అపురూప భావన. మన దేశంలో నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్–నానో యుగం వరకు కుటుంబ వ్యవస్థలో కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ ఫామిలీలు, సరళ కుటుంబాలు భాగమై ఉన్నాయి. వీటికి తోడు నేటి ఆధునిక యుగంలో ప్రేమజంటల సహజీవనాలు, సింగిల్ పేరంట్ కుటుంబాలు, పిల్లలు లేని కుటుంబాలు లాంటి విపరీత వ్యవస్థలు కూడా రావడం విచారకరం. భారతీయ సగటు కుటుంబంలో 4 – 5 (కుటుంబ పరిమాణం 4.6) సభ్యులు ఉంటున్నారు. భారతీయ కుటుంబ పుణాదులుగా విధేయత, సమగ్రత, ఐక్యత గుర్తించబడినవి. భారతదేశంలోని దాదాపు 140 కోట్ల జనాభాతో 25 కోట్ల కుటుంబాలు ఉన్నాయని అంచనా. వీటిలో 20 కోట్లు హిందూ, 3 కోట్ల ముస్లిమ్, 6.3 మిలియన్ల క్రిస్టియన్, 4.1 మిలియన్ల సిక్కు, 1.9 మిలియన్ల జైనులకా పాటు ఇతర మతాలకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. భారత్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విద్య, మహిళాసాధికారత, పాశ్చాత్య ధోరిణి, వివాహ వ్యవస్థలో మార్పులు, సామాజిక విలువల్లో మార్పులు, వ్యవసాయ, గ్రామీణ పరిశ్రమలు తగ్గడం లాంటి ప్రధాన కారణాలతో కుటుంబ వ్యవస్థల్లో పెను మార్పులు వస్తున్నాయి. స్వల్ప విభేదాలతో విడిపోవడంతో సింగిల్ ఫాదర్ లేదా సింగిల్ మదర్‌తో పిల్లలు ఎదగడం లాంటివని భారతీయ కుటుంబ వ్యవస్థను పరిహాసం చేస్తున్నాయి. నేటి పిల్లలే రేపటి తల్లితండ్రులని మరువరాదు. న్యూక్లియర్, సింగిల్ పేరంట్ కుటుంబాలు పెరుగుతున్న డిజిటల్ కాలంలో పిల్లలకు సామాజిక అవగాహన, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం జరగడం లేదు. పిల్లల్లో పేరెంట్స్ పట్ల నిర్లక్ష్యం, చులకన భావం పెరిగి, అనేక దురలవాట్ల నడుమ సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదకర దుస్థితిలో భారత సమాజం నేడు ఉన్నది. కుటుంబాలను సౌభాగ్య కోవెలలుగా, అమ్మనాన్నల్ని ఆది దేవతలుగా భావిస్తూ, భరతమాత నుదుట సంతోష తిలకం దిద్దుదాం.

# ప్రతి రోజూ పెరుగు తింటే.....

పెరుగును రోజూ తీసుకోవడం వల్ల ఖచ్చితంగా చాలా ఆరోగ్యంగా ఉంటాము. ఇక పెరుగుని ప్రతి రోజూ కూడా తినడం వల్ల ఇంకా మనకి ఎన్ని రకాల లాభాలు కలుగుతాయో ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం. డయాబెటిస్ బారిన పడే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు తేల్చారు. ఇక ఈ అధ్యయనం తాలూకు వివరాలను ఒబెసిటీ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఇక హార్వార్డ్ పరిశోధకులు చేపట్టిన మరో అధ్యయనం ప్రకారం ప్రతి రోజూ పెరుగును తినడం వల్ల షుగర్ వచ్చే అవకాశాలు 16 శాతం వరకు తగ్గుతాయని తేల్చారు. అందువల్ల పెరుగును రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సైంటిస్టులు అంటున్నారు. దీంతో డయాబెటిస్ బారిన పడకుండా ఉండవచ్చని, అలాగే ఇతర అనారోగ్య సమస్యలు కూడా నయం అవుతాయని, పోషకాలు లభిస్తాయని చెబుతున్నారు. అయితే బరువు తగ్గించుకునే ప్రయత్నం చేస్తూ రోజూ పెరుగు తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుందని వారు అంటున్నారు. పెరుగును రోజూ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దీంతో హైబీపీ తగ్గుతుంది. మన పొట్టకు కావల్సిన మంచి బాక్టీరియా అందుతుంది. దీంతో జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. అయితే సైంటిస్టులు చేపట్టిన తాజా అధ్యయనాల ప్రకారం రోజూ 1 లేదా 2 కప్పుల పెరుగును తినడం వల్ల షుగర్ వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని తేల్చారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలను న్యూట్రిషన్ అనే జర్నల్‌లోనూ ప్రచురించారు. ఇందులో భాగంగా పెరుగును రోజూ తీసుకుంటున్న పలువురి బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గాయని గుర్తించారు. పెరుగులో మన శరీరానికి అవసరం అయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. అందువల్ల దీన్ని మనకు ఆరోగ్య ప్రదాయిని అని చెప్పవచ్చు. పూర్వం రోజుల్లో మన ఇళ్లో పెరుగు ఎక్కువగా ఉండేది. అందువల్ల మన పూర్వీకులు పెరుగు ఎక్కువగా తినేవారు. దీంతో వారు ఆరోగ్యంగా ఉండేవారు. ముఖ్యంగా మన భారతీయులు పెరుగును పురాతన కాలం నుంచి ఉపయోగిస్తున్నారు. దీన్ని నేరుగా తింటారు. లేదా దీంతో మజ్జిగ వంటివి చేసుకుని తాగుతారు. పెరుగుతో పలు రకాల వంటకాలను కూడా చేసుకొని తినవచ్చు. కాబట్టి ఖచ్చితంగా తినండి.




## మహిళల్లో ఆ సమస్యలను నివారించే సూపర్ ఫుడ్...!




నేటి కాలంలో చాలా మంది మహిళలు సంతానలేమి సమస్యలతో బాధపడుతున్నారు. అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారం, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి, హార్మోన్ల మార్పులు దీనికి ముఖ్య కారణాలు. అంతేకాకుండా సిస్ట్‌లు, థైరాయిడ్ వంటి అనేక సమస్యలు కూడా మహిళల గర్భధారణకు ఆటంకంగా మారుతున్నాయి. ప్రెగ్నెన్సీ సమస్యను తగ్గించుకోవాలంటే ధూమపానం, మద్యపానం మానేయడంతోపాటు ఆహారంలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ విధమైన జీవనశైలి మార్పులు గర్భధారణ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రముఖ పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. మహిళల్లో గర్భధారణ సమస్యలను నివారించడానికి ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చాలా ముఖ్యమైనవి. ప్రధానంగా ఆహారంలో 4 సూపర్‌ఫుడ్‌లను చేర్చుకోవాలి. ఇవి హార్మోన్లను మార్చడం ద్వారా సంతానోత్పత్తిని పెంచడంలో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి. అరటిపండు సహజంగా సంతానోత్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఇందులో విటమిన్ -6 ఉంటుంది. ఇది హార్మోన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఈ పండు పురుషులు, మహిళలు ఇద్దరికీ ప్రభావవంతంగా ఉంటుంది. అలాగే చర్మ సంరక్షణకు మాత్రమే కాకుండా కుంకుమపువ్వు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఆయుర్వేదంలో కుంకుమ పువ్వుకు చాలా ప్రాముఖ్యత ఉంది. జాఫ్రిన్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది వంధ్యత్వాన్ని నివారిస్తుంది. సంతానోత్పత్తిని పెంచుతుంది. ఆయుర్వేదంలో నెయ్యికి చాలా ప్రాముఖ్యత ఉంది. వివిధ శారీరక సమస్యలకు చికిత్స చేయడానికి నెయ్యి మూలికా ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి సంతానలేమిని నివారించడానికి ఆహారంలో నెయ్యిని చేర్చుకోవాలి. జీడిపప్పు, బాదం, పిస్తాలు గర్భాశయ సమస్యలను నయం చేయడంలో, సంతానలేమిని నివారించడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ డ్రై ఫ్రూట్స్ రోజువారీ ఆహారంలో తప్పక చేర్చుకోవాలి.

## రాత్రుళ్లు అన్నం బదులుగా చపాతీలు తింటున్నారా...?




ఈ మధ్యకాలంలో చాలామంది యువతకు ఊబకాయం పెద్ద తలనొప్పిగా మారింది. దానికోసం తమ బరువును కంట్రోల్ చేయాలని శతవిధాల తాపత్రయపడుతుంటారు. అందుకోసం రాత్రిపూట అన్నం మానేసి మరీ చపాతీలు తినడం మొదలుపెడుతుంటారు. అయితే ఇలా ఉన్నఫలంగా వైట్ రైస్ బదులు రాత్రుళ్లు చపాతీలు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనే క్రమంలో ఒక పూట పూర్తిగా రైస్ మానేసేకంటే.. అన్నం తక్కువ తిని.. చపాతీలు ఎక్కువ తీసుకోవడం బెటర్ అని డాక్టర్ల సూచన. అలాగే రాత్రుళ్లు వేడివేడి చపాతీలు తినే బదులు నిల్వ ఉన్న చపాతీలు తినడం ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుందన్నారు డాక్టర్లు. అప్పుడే వేడిగా వచ్చే చపాతీల్లో నూనె కంటెంట్ ఎక్కువ ఉంటుందని.. అలా కాకుండా నిల్వ ఉండే చపాతీలు, రోటీల్లో పోషకాలు ఎక్కువ ఉండటం వల్ల.. అవి తింటే బ్లడ్ ప్రెషర్, అల్సర్స్, గ్యాస్ వంటి కడుపు సంబంధిత రోగాలు తగ్గిపోతాయన్నది వైద్యుల వాదన. అలాగే రక్తహీనతతో బాధపడుతున్నవారు కూడా చపాతీలు తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చునని అంటున్నారు. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి.. పై వార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.

## కిడ్నీలు డామేజ్ అవ్వకుండా ఉండాలంటే..?




మన శరీరంలో ఉండే ముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు కూడా ఒకటి. ఎందుకంటే కిడ్నీ అనేది మన శరీరంలోని వ్యర్థాలను ఫిల్టర్ చేయడం ద్వారా శరీరాన్ని ఎంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే కిడ్నీలో సమస్య వస్తే మాత్రం శరీరం మొత్తం కూడా కుప్పకూలిపోవడం ఖాయం. ఈ రోజుల్లో చాలా మంది కూడా కిడ్నీ స్టోన్ సమస్యలతో బాధపడుతున్నారు. అయితే ఈ కిడ్నీలో రాళ్లు ఏ వయసులోనైనా ఈజీగా రావచ్చు. అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారం ఇంకా తక్కువ నీరు తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. నీరు ఎక్కువగా తాగితే కిడ్నీలు ఎప్పటికప్పుడు ఫిల్టర్ అవుతూ ఉంటాయి. అలాగే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం తింటున్నారో, ఏం తాగుతారో ఖచ్చితంగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. కిడ్నీలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. ఆ ఆహారాలు గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఎక్కువగా టీ లేదా కాఫీ తాగడం ఆరోగ్యానికి అసలు ఏమాత్రం మంచిది కాదు. రోజుకు రెండు నుంచి మూడు కప్పుల దాకా కాఫీ తాగడం మంచిది. కానీ, ఎక్కువ మొత్తంలో కాఫీ లేదా టీ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. అలాగే ఉప్పు సాధారణంగా ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఉప్పు ఎక్కువగా తినడం వల్ల రక్తహీనత, అధిక రక్తపోటు సమస్యలు వస్తాయి. అంతేకాకుండా, కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కూడా కారణం అవుతాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది కూడా ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్ వైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా వేయించిన ఆహారాన్ని తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇవి కిడ్నీలో రాళ్లకు కూడా కారణమవుతాయి. కాబట్టి వేయించిన ఫాస్ట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే రూట్ వెజిటేబుల్స్ ఎక్కువగా తినకూడదు. వీటిల్లో అధిక మొత్తంలో ఆక్సలేట్‌లను కలిగి ఉంటాయి. ఇవి మూత్రపిండాల్లో రాళ్లను ఏర్పరుస్తాయి. నీరు ఎక్కువగా తాగితే కిడ్నీలు ఎప్పటికప్పుడు ఫిల్టర్ అవుతూ ఉంటాయి. అలాగే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం తింటున్నారో, ఏం తాగుతారో ఖచ్చితంగా తెలుసుకోవడం చాలా ముఖ్యం.

## గురక వేధిస్తుందా......?



గురక.. చాలా మందిని వేధించే సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొనే ఉంటారు. గురక సాధారణంగానే భావించినా ఇతర అనారోగ్య సమస్యలకు సైతం దారి తీస్తుందని వైద్యులు చెబుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా గురక మూర్ఛకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మూర్ఛ అనేది పుట్టుకతోనే వస్తుంది. అయితే గురక ఉన్న వారికి కూడా భవిష్యత్తులో మూర్ఛ వచ్చే అవకాశాలు ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మూర్ఛ రావడానికి పక్షవాతం, అధిక రక్తపోటు, మెదడులో కణితి వంటి రకరకాల అంశాలతో పాటు గురక కూడా ఒక కారణమని పరిశోధకులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 60 ఏళ్ల తర్వాత మూర్ఛ రావడానికి కారణమని అంటున్నారు. నిద్ర పోతున్నప్పుడు కాసేపు శ్వాస ఆడకపోవటం (స్లీప్ అప్నియా), రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటానికీ సంబంధం ఉంటున్నట్టు తేలింది. కొందరిలో నిద్రపోతున్న సమయంలో గొంతు వెనకాల భాగం వదులై శ్వాస మార్గానికి అడ్డుతగులుతుంది. ఈ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతుంది. రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గడంతో ఉక్కిరిబిక్కిరై బిగ్గరగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారు. ఇదంతా మనకు తెలియకుండానే జరుగుతుంది.

## మలబద్ధక సమస్య బాధిస్తోందా.....!



ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్ స్టైల్ లో చాలామంది ఎదుర్కొంటున్న అతి చిన్నపాటి సమస్యల్లో మలబద్ధకం కూడా ఒకటి. మనం తీసుకునే ఆహారంలో మార్పులు, ఒత్తిడి వల్ల ఈ సమస్య మరింతగా బాధపెడుతోంది అయితే ఈ సమస్య నుంచి బయటపడేందుకు ప్రజలు చాలా మార్గాలను వెతుక్కుంటున్నారు కొంతమంది అయితే మందులు వాడుతారు.. మరి కొంతమంది సహజ విధానంలో మలబద్ధకం సమస్యకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తూ ఉంటారు.. ఇక అలా సహజ విధానంలో మలబద్ధకం సమస్యకు చెక్ పెట్టడంలో ఆముదం ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఆముదం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటుంది ఇంతకీ ఆముదంతో మలబద్ధకానికి ఎలా చెక్ పెట్టవచ్చో ఇప్పుడు చూద్దాం.. ఆముదం పేగుల్లో మలాన్ని సులువుగా కదిలేలా చేస్తుంది. ముఖ్యంగా పేగు కదలికలను సులభతరం చేస్తుంది.

## ఇది తింటే రక్తం పలుచగా అవుతుంది..!



ఈ మధ్య చిన్న వయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయ్.. తక్కువ ఏజ్‌లోనే బీపీ సమస్యలు వెంటాడుతున్నాయ్. ఈ కారణాలతో రక్తం చిక్కబడుతోంది. ఆ రక్తాన్ని గుండె సరిగ్గా పంప్ చేయలేకపోతుంది. దీంతో రక్త ప్రసరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్తం పలుచగా ఉంటేనే.. గుండె పంప్ చేసేందుకు ఈజీ అవుతుంది. అందుకే ఈ మధ్య కాలంలో కొంతమంది సమస్యలు ఉన్నా, లేకపోయినా రక్తాన్ని పలుచన చేసే మెడిసిన్ వాడుతున్నారు. గుండె సమస్యలు, హైబీపీ వంటి సమస్యలు ఉన్నవారు. ఇవి ఒకసారి మొదలెడితే లైఫ్ లాంగ్ వాడాల్సి ఉంటుంది. మీ లైఫ్ స్టైల్ మార్చుకోకపోతే.. జీవితం కాలం ఈ మెడిసిన్ వాడాల్సి ఉంటుంది. ప్రధానంగా తక్కువ నీరు తాగడం, ఎక్కువ ఉప్పు వినియోగం.. నూనె, నెయ్యి లాంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తం చిక్కగా అవుతుంది. ఆయిల్ లేకుండా, ఉప్పు లేకుండా.. రా ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తం పలుచగా అవుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్నింగ్, ఈవెనింగ్ ఎక్కువ ఉడకని ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ.. మధ్యాహ్నం ఉడికిన ఫుడ్ తిన్నా అందులో ఉప్పు లేకుండా చూసుకుంటే రక్తం చిక్కబడటం ఆగుతుందని చెబుతున్నారు. ఇలా ఫాలో అయితే నెలా, రెండు నెలల తర్వాత మెడిసిన్ మానిసేనా ఇబ్బంది ఉండదని ప్రకృతి వైద్యులు మంతెన చెబుతున్నారు.




## స్విమ్ సూట్ గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న నేహా మాలిక్




# అనసూయ భరద్వాజ్ పుష్ప ది రూల్ దాక్షాయణి లుక్ అదిరిందంతే

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. సుకుమార్ డైరెక్షన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో వస్తున్న ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా మరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ నటిస్తోండగా.. ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా పుష్ప పార్టు 1లో అనసూయ భరద్వాజ్ పోషించిన దాక్షాయణి పాత్రకు ఏ రేంజ్‌లో రెస్పాన్స్ వచ్చిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు సీక్వెల్‌లో అనసూయ రోల్ అంతకుమించి ఉండబోతుందని తాజా లుక్‌తో చెప్పకనే చెబుతున్నారు మేకర్స్. అనసూయకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ.. ఈ మూవీ నుంచి దాక్షాయణి పాత్ర లుక్‌ను విడుదల చేశారు. అనసూయ టేబుల్‌పై ఠీవీగా కూర్చొన్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇక దాక్షాయణి భర్త పాత్రలో మంగళం శ్రీనుగా మరోసారి అలరించబోతున్నాడు సునీల్. మరి సునీల్ పాత్రను ఎప్పుడు పరిచయం చేస్తారనేది చూడాలి. ఈ మూవీ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నుడు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ షురూ చేశారు. ఇటీవలే మేకర్స్ పుష్ప ది రూల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ సింగిల్ పుష్ప పుష్ప సాంగ్ మాస్ బీట్‌తో సాగుతూ.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీతోపాటు బెంగాలీ భాషల్లో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది.

## ఇండియన్ 2 రిలీజయ్యేది అప్పుడే.. ఇండియన్ 3పై క్రేజీ అప్‌డేట్




కోలీవుడ్, టాలీవుడ్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి ఇండియన్ 2. కమల్‌హాసన్ టైటిల్ రోల్‌లో భారతీయుడుకు సీక్వెల్‌గా వస్తోన్న ఈ మూవీకి శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే మేకర్స్ తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదల చేసిన ఇండియన్ 2 నుంచి గ్లింప్స్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రెండు అప్‌డేట్స్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఇండియన్ 2తోపాటు ఇండియన్ 3 కూడా ఒకేసారి షూటింగ్ జరుపుకున్నట్టు ఇప్పటికే వార్తలు తెరపైకి వచ్చాయని తెలిసిందే. ఇండియన్ 2 విడుదలపై నెలకొన్న డైలామాకు చెక్ పడ్డది. ఈ చిత్రాన్ని జులై విడుదల చేయనున్నారు మేకర్స్. దీనిపై అధికారిక ప్రకటన రానుందట. అంతేకాదు ఇండియన్ 2 ఎండ్ క్రెడిట్స్‌లో ఇండియన్ 3 ట్రైలర్‌ను వేయబోతున్నారని సమాచారం. మొత్తానికి శంకర్ ఆలస్యమైనా అభిమానులకు విజువల్ ట్రీట్ అందించేలా డబుల్ బొనాంజాను సిద్ధం చేశాడని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. పాన్ ఇండియా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య, బాబీ సింహా, సిద్దార్థ్, సముద్రఖని, లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం, మధుబాల, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, కీలక పాత్రలే పోషిస్తున్నారు. ఈ మూవీని లైకా ప్రొడక్షన్స్ -రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్–సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన ఇండియన్ 2 ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఇండియన్ 2 ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ సోనీ మ్యూజిక్ భారీ ధరకు దక్కించుకుంది.

# ఉన్న ఊర్లోనే ఉంటూ.. కోటీశ్వరులయ్యే ఛాన్స్. బెస్ట్ బిజినెస్ ప్లాన్



సరైన ప్రణాళిక, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యాపారాలు చేస్తే లాభాలు ఆర్జించడం పక్కా. అలాంటి ఓ మంచి బిజినెస్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుతం చిన్నారులు ఇష్టపడి తినే చిరు తిళ్లకు భారీగా డిమాండ్ ఉంటోన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా కిరాణం దుకాణాల్లో దొరికే కార్న్‌తో తయారు చేసే స్నాక్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగం చేసే ప్రతీ ఒక్కరికీ వ్యాపారం చేయాలనే ఆలోచన ఉంటుంది. ఉద్యోగం చేస్తే వచ్చే జీతం కంటే వ్యాపారంలో అధికంగా ఆర్జించవచ్చే ఆలోచనలో ఉంటారు. అందుకే ఎప్పటికైనా ఒక మంచి వ్యాపారాన్ని ప్రారంభించాలనే ఆశయంతో ఉంటారు. అందుకోసం ప్రణాళికలు రచిస్తుంటారు. అయితే పెద్ద వ్యాపారం చేయాలంటే కేవలం పట్టణాల్లోనే ఉండాలనే ఆలోచనలో మనలో చాలా మందికి ఉంటుంది. కానీ నిజానికి ఉన్న ఊర్లోనే ఉంటూ కోట్లలో సంపాదించే అవకాశాలు కూడా ఉన్నాయి. సరైన ప్రణాళిక, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యాపారాలు చేస్తే లాభాలు ఆర్జించడం పక్కా. అలాంటి ఓ మంచి బిజినెస్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుతం చిన్నారులు ఇష్టపడి తినే చిరు తిళ్లకు భారీగా డిమాండ్ ఉంటోన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా కిరాణం దుకాణాల్లో దొరికే కార్న్‌తో తయారు చేసే స్నాక్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. కేవలం చిన్నారులే కాకుండా పెద్దలు కూడా వీటిని ఎంతో ఇష్టంగా తింటున్నారు. ఇలాంటి స్నాక్స్ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తే కోట్లలో లాభాలు ఆర్జించవచ్చు. అంతేనా మీతో పాటు మరో నలుగురికి ఉపాధి సైతం కల్పించవచ్చు. ఇంతకీ ఈ వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి.? ఏ మిషనరీ అవసరపడుతుంది.? ఇప్పుడు తెలుసుకుందాం.. ఈ స్నాక్స్ తయారీ యూనిట్‌ను ప్రారంభించాలంటే ఒక పెద్ద గది ఉండాలి. అలాగే ఫుడ్ సేఫ్టీ అధికారుల నుంచి లైసెన్స్ పొంది ఉండాలి. ఇక ఇందుకోసం కొన్ని రకాల మిషిన్స్ అవసరపడతాయి. పోలో రింగ్స్ వంటి అన్ని రకాల స్నాక్స్‌ను తయారు చేయడానికి కార్న్ పౌడర్ అవసరపడుతుంది. కార్న్‌ను రవ్వాలా తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో ఈ ముడి వస్తువు కూడా రడీగా లభిస్తోంది. ఇక ఈ కార్న్ రవ్వను ఒక మిషన్‌లో వేయాల్సి ఉంటుంది.

## తక్కువ బడ్జెట్‌లో అత్యధిక మైలేజ్ ఇచ్చే కార్లు ఇవే....!



కారు కొనాలనుకునేవారు లో బడ్జెట్ లో ఉండాలనుకుంటారు. కానీ ఇదే సమయంలో మైలేజ్ ఇచ్చే కారు కోసం కూడా చూస్తారు. అయితే తక్కువ బడ్జెట్ లో మంచి మైలేజ్ ఇచ్చే కారు ఇచ్చే మార్కెట్లో ఉన్నాయి.రూ. 7 లక్షల బడ్జెట్ లో 25 కిలోమీటర్ల మైలేజ్ ఇచ్చే కారు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మారుతితో పాటు వివిధ కంపెనీలకు చెందిన కొన్ని కార్లు వినియోగదారులకు ఆకర్షిస్తున్నాయి. ఆ కార్ల వివరాలు ఉన్నాయి.మారుతి నుంచి రిలీజ్ అయిన స్విఫ్ట్ 1.23 లీటర్ పెట్రోల్ ఇంజిన్ తో పాటు 80.46 బీహెచ్ పీ పవర్, 11.7 ఎన్ ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ మోడల్ ను 6.49 ప్రారంభ ధర నుంచి రూ. 9.88 లక్షల వరకు విక్రయిస్తుంది. ఈ కారు 24 నుంచి 25 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. హ్యుందాయ్ కంపెనీకి చెందిన గ్రాండ్ ఐ10 ను రూ. 5.91 నుంచి 8.66 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇది 17 నుంచి 24 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది.మారుతికి గట్టి పోటీ ఇస్తోంది టాటా కంపెనీ. ఈ కంపెనీకి చెందిన ఆల్ట్రోజ్ రూ. 6.64 లక్షల నుంచి రూ. 10.79 లక్షల వరకు విక్రయిస్తున్నారు. 1.2 లీటర్ 3 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ తో పాటు 86.80 బీహెచ్ పీ పవర్ తో పాటు 115 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. ఈ మోడల్ 19.14 నుంచి 26.2 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. సిట్రోయెన్ కంపెనీ నుంచి సి 3 కారు రూ. 6.16 లక్షల ప్రారంభ ధర నుంచి రూ. 9.23 లక్షల వరకు విక్రయిస్తుంది. హ్యుందాయ్ ఏ 20 హ్యాచ్ బ్యాక్ నుంచి రూ. 7.04 లక్షల ప్రారంభ ధర నుంచి రూ. 11.20 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

## దేశంలోకి విదేశీ సరుకుల వరద....!




**న్యూఢిల్లీ :** స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఎగుమతుల్లో వృద్ధి తక్కువగా ఉండగా.. మరోవైపు ఇబ్బడిమబ్బడిగా దిగుమతులు పెరిగాయి. గడిచిన ఐదేళ్లలో ఎగుమతుల వృద్ధి కంటే దిగుమతులు రెట్టింపు అయ్యాయి. గడిచిన 2019–24 ఆర్థిక సంవత్సరాల్లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భాగస్వామ్య దేశాల నుండి భారత్‌కు వస్తు దిగుమతులు 38 శాతం పెరిగాయి. భారత్‌తో ఎఫ్‌టిఎ కలిగిన యుఎఇ, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాల నుంచి 2023–24లో 187.92 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) సంస్థ వెల్లడించింది. 2018–19 నాటికి ఈ దిగుమతులు 136.20 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ఎఫ్‌టిఎ భాగస్వామ్య దేశాలకు భారత ఎగుమతులు 2023–24లో 14.48 శాతం మాత్రమే పెరిగి 122.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2018–19లో 107.20 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఈ పరిణామాలతో మోడీ హయంలోని బిజెపి సర్కార్ పలు దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ) ఆర్థిక వ్యవస్థకు చేటు చేస్తున్నాయని స్పష్టమవుతోంది.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయా? నివేదికలు ఏం చెబుతున్నాయి



అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల్లో పెరుగుదల కనిపించింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ముడి చమురు వినియోగదారులైన అమెరికా, చైనాలో డిమాండ్ మెరుగుదల సంకేతాలు ఉన్నాయి. దీని ప్రభావం ముడి చమురు ధరపై కనిపిస్తోంది. నిజానికి చైనా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి బాటలో పయనిస్తోంది. దీంతో డిమాండ్‌లో పెరుగుదల కనిపిస్తోంది. మరోవైపు అందరి చూపు కూడా అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలపైనే కేంద్రీకృతమైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల్లో పెరుగుదల కనిపించింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ముడి చమురు వినియోగదారులైన అమెరికా, చైనాలో డిమాండ్ మెరుగుదల సంకేతాలు ఉన్నాయి. దీని ప్రభావం ముడి చమురు ధరపై కనిపిస్తోంది. నిజానికి చైనా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి బాటలో పయనిస్తోంది. దీంతో డిమాండ్‌లో పెరుగుదల కనిపిస్తోంది. మరోవైపు అందరి చూపు కూడా అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలపైనే కేంద్రీకృతమైంది. ద్రవ్యోల్బణం గణాంకాలు ఎక్కువగా ఉంటే, ముడి చమురు ధర పెరుగుదలకు బదులుగా మనం క్షీణతను చూడవచ్చు. ఎందుకంటే ముడి చమురు డిమాండ్ తగ్గుదల కనిపించవచ్చు. అయితే ఈసారి ద్రవ్యోల్బణం గణాంకాలు ఫెడ్‌కి అనుగుణంగా కనిపించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. దేశంలోని ప్రధాన నగరాలు మరియు మెట్రోలలో ధరలు మార్చి 16, 2024న ఉన్నవిగానే ఉన్నాయి. ఆ రోజు దేశంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌పై రూ. 2 తగ్గింపు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో ఇంధన ధరల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో కూడా చెప్పుకుందాం. ముడి చమురు ధరలో పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర పెరుగుతోంది. సోమవారం అమెరికా ముడిచమురు ధర 1 శాతానికి పైగా పెరిగింది. కాగా మంగళవారం ధరలు బ్యారెల్‌కు 79.26 డాలర్లకు తగ్గాయి.


## పడిపోతున్న పసిడి......



బంగారం, వెండి ధరలు వరుసగా పడిపోతున్నాయి. మొన్న రూ. 700 తగ్గి..నిన్న స్థిరంగా కొనసాగాయి. ఈరోజు మరింతగా స్వల్పంగా తిగి వచ్చింది. వెండి మాత్రం భారీ స్థాయిలో తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారం స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 2337 డాలర్లుగా కొనసాగుతోంది. స్పాట్ సిల్వర్ ధర 28.30 డాలర్ల వద్ద నమోదవుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. బులియన్ మార్కెట్ ప్రకారం.. మే14న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 67,150గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ. 73,250 గా ఉంది. మే 13న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.. 67,250తో విక్రయించారు.


## ద్రవ్యోల్బణంతో వంటిల్లుపై భారం....!

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా నిత్యావసరాల సరుకుల ధరలు పెరుగుతుండటంతో వంటిల్లుపై భారం పడుతుంది. భోజన వ్యయం పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ డేటాను విడుదల చేసింది. ఆ వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్‌లో కుటుంబాల శాఖాహార భోజనం వ్యయం 8 శాతం పెరిగి రూ. 27.4కు చేరింది. గతేడాది ఇదే నెలలో ప్లేట్ వ్యయం రూ. 25.4గా ఉందని క్రిసిల్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. మరోవైపు మాంసహారం భోజనం రేటు 4 శాతం తగ్గిందని తెలిపింది. కాగా.. ఉల్లిపాయలు, టమాటా, బంగాళదుంపలతో పాటు కూరగాయలు, పప్పుల ధరలు ఎగిసి పడటంతో శాఖహార భోజనం ఖర్చు పెరిగిందని తెలిపింది. చికెన్ ధరలు తగ్గడంతో నాన్‌వెజ్ భోజనం ఖర్చు తగ్గిందని పేర్కొంది. శాఖహారంలో రోటీ, ఉల్లిపాయ, టమాటో, బంగాళదుంప, అన్నం, పప్పు, పెరుగు,



సలాడ్ ఉండగా.. మంసాహారం భోజనంలో ఇవే పదార్థాలుంటాయి. కేవలం పప్పు స్థానంలో మాంసం, గుడ్లను చేర్చి.. లెక్కిస్తుంది. ఇందులో నూనెలు, వంటగ్యాస్, మసాలాల వ్యయాలను పరిగణలోకి తీసుకుంటుంది.

## లోపభూయిష్టంగా పూచీకత్తు ప్రమాణాలు




**న్యూఢిల్లీ :** భారతీయ బ్యాంకింగ్ రంగం ప్రమాదంలో ఉన్నదని అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ హెచ్చరించింది. పూచీకత్తు ప్రమాణాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నది. ఇటీవలికాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సైతం పర్యవేక్షణ లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ పలు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై కొరడా ఝుళిపించిన విషయం తెలిసిందే. ఆయా సంస్థలపై రకరకాల ఆంక్షలనూ విధించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో ఫిచ్ రేటింగ్స్ హెచ్చరిక అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. ‘భారతీయ బ్యాంకులపై రిస్క్ ప్రొఫైల్ ప్రభావం ఎక్కువ’ అనే శీర్షికతో సోమవారం ఫిచ్ ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో రుణాల్లో వృద్ధి నమోదైందని సంబురపడాల్సిన పనిలేదని, ఆ రుణాలతో కనిపించని ఇబ్బందులు ఎన్నో ఎదురుకావచ్చని హెచ్చరించడం గమనార్హం. ఈ ఏడాది మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాలు 16 శాతం పెరిగాయి. ఇందులో రిటైల్ రుణాలు దాదాపు 10 శాతంగా ఉన్నాయి. 2020–21 నుంచి చూస్తే వీటి వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 20 శాతంగా ఉన్నది. అయితే పర్సనల్ లోన్లు, క్రెడిట్ కార్డుల వంటి రిటైల్ రుణాల్లో పెరుగుదల.. మొత్తం లోన్లకున్న ముప్పును పెంచుతుందని ఫిచ్ చెప్తున్నది. ఈ అన్‌సెక్యూర్డ్ లోన్లు ఎంత పెరిగితే అంత ఇబ్బందులేనని పేర్కొన్నది. రిటైల్ రుణాలకు సంబంధించి పాటిస్తున్న పూచీకత్తు ప్రమాణాల్లో పారదర్శకత చాలా తక్కువగా ఉందని ఫిచ్ చెప్తున్నది. లోన్–టు–వాల్యూ రేషియో, రుణగ్రహీత రుణ చరిత్ర, రుణాలు తీసుకునేవారి ఆర్థిక సామర్థ్యం, వారి క్రెడిట్ స్కోర్, రికవరీ శాతం వంటి అంశాల్లో ఇతర ఆసియా దేశాల బ్యాంకులతో పోల్చితే భారతీయ బ్యాంకుల్లో ప్రమాణాలు సరిగా లేవని ఫిచ్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

గరుడ వార్త



# అక్కడే...ఫోకస్!

## ఆ నాలుగింటిపైనే జనం ఆసక్తి




అవును దేశ వ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇప్పటికే నాలుగు విడతల్లో 379 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. మరో 3 విడతల్లో మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరగున్నాయి. కాగా, ఈ నెల 13న దేశ వ్యాప్తంగా జరిగిన నాలుగో విడతలో 96 లోక్?సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో హైదరాబాద్ లోక్‌సభ స్థానం అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థానం అందరిని తనవైపు చూపు తిప్పుకునేలా చేసింది.

**రాహుల్ పోటీ చేసే రెండూ కీలకమే..**

కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ పోటీ చేసిన వాయనాడ్, రాయబరేలితో పాటు బీజేపీ అభ్యర్థి పోటీ చేసిన తమిళనాడులోని కోయంబత్తూర్ స్థానాలపై కూడా అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఇప్పటికే కోయంబత్తూర్?లో మొదటి విడత ఎన్నికలు జరిగాయి. ఇక్కడి నుంచి బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై పోటీ చేశారు. ఆయన గెలుపుపై బెట్టింగ్స్ పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. అటు వాయినాడ్ నుంచి రెండో విడతలో భాగంగా కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ పోటీ చేశారు. ఇక్కడ ఆయనకు ప్రత్యర్థులుగా సీపీఐ నుంచి అన్నీ రాజాతో పాటు బీజేపీ ఆ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్ గట్టి పోటీ ఇచ్చారు. ఈ స్థానంపై కూడా దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

మరోవైపు రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న మరో స్థానం ఉత్తర ప్రదేశ్‌లోని రాయబరేలి. గత ఎన్నికల వరకు పోటీ చేసిన అమేథీ నుంచి కాకుండా.. తన తల్లి, నాయనమ్మ, తాత ప్రాతినిధ్యం వహించిన రాయబరేలిని రాహుల్? ఎంచుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అటు రాహుల్ రాయబరేలితో పాటు వాయనాడ్ నుంచి గెలిస్తే ఏ లోక్ సభ నియోజకవర్గాన్ని ఉంచుకుంటానేది హాట్ టాపిక్‌గా మారింది.

**అలా అయితే.. ప్రియాంక బరిలో దిగేనా**

ఒకవేళ రాహుల్ గాంధీ రెండు చోట్ల గెలిస్తే.. రాయబరేలికి రాజీనామా చేసి తన చెల్లెలు ప్రియాంక వాద్రాను బరిలో దింపాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు 2014 వరకు తనకు కంచుకోటగా ఉన్న అమేథీ బరిలో తన కుటుంబానికి సన్నిహితుడైన శర్మను బరిలో దించారు. అక్కడ బీజేపీ తరుపున స్మృతి ఇరానీ రెండోసారి ఈ స్థానం గెలవాలనే పట్టుదలతో పనిచేస్తున్నారు. ఇక ఇక్కడ ఫలితం ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సిందే.

**టఫ్ ఫైట్ ఇచ్చిన మాధవీలత..**

ఈ మూడు లోక్‌సభ సీట్లతో పాటు హైదరాబాద్ లోక్‌సభ స్థానంపై దేశ వ్యాప్తంగా ఆసక్తి నెలకొనేలా చేశారు బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత. తన ప్రచారంతో ఒవైసీకి ముచ్చెమటలు పట్టించారు. ఎన్నడూ గుడిముఖం చూడని ఒవైసీని గుళ్ల వైపు పరిగెత్తాలా చేశారనే ప్రచారం ఉంది. అయితే.. బీజేపీ అధిష్ఠానం మాధవీలతను దించడం వెనక పెద్ద గ్రౌండ్ వర్క్ చేసినట్టు తెలుస్తోంది. ఆమె అప్పటికే తన లోక్ సభ నియోజకవర్గంలో ఎన్నో కార్యక్రమాలతో ప్రజల్లో వెళ్లారు. అయితే.. ఎన్నికల ఫలితాల తర్వాత మొత్తంగా ఒవైసీకి కోటకు బీటలు వారేలా చేస్తారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ఈ నియోజకవర్గంలో ఎవరు గెలిచినా.. టఫ్ ఫైట్‌లో తక్కువ మార్జిన్‌తో బయటపడతారనేది రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**పెద్ద మొత్తంలో నకిలీ ఓట్ల తొలగింపు..**

ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 5 లక్షల బోగస్ ఓట్లు తొలిగించారు. ఇలా తొలిగించిన ఓట్లలో అత్యధిక శాతం మజ్లిస్ ప్రభావిత ప్రాంతాల్లో ఉండటంతో రాబోయే ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం లేకపోలేదని ఆ పార్టీ నేతల్లో కలకలం నెలకొంది.. హైదరాబాద్ పరిధిలో దాదాపు ఇంత పెద్ద మొత్తంలో నకిలీ ఓట్లను తొలిగించడం అనేది ఓ రికార్డు అనే చెప్పాలి. తన లోక్‌సభ పరిధిలో ఇన్ని లక్షల బోగస్ ఓట్లను తొలిగించినా ఒవైసీ కిక్కురుమనకుండా ఉండటం వెనక ఆయన ఓటమి భయాన్ని సూచిస్తోందనే వాదన కూడా ఉంది.

**పాతబస్తీలో ఫుల్ రెస్పాన్స్..**

మరోవైపు మాధవీలత ప్రచారానికి ఊహించిన రేంజ్‌లో పాతబస్తీ లాల్ దర్వాజా, సుధా టాకీస్ ప్రాంతాల్లో రెస్పాన్స్ రావడం ఆమెకు మాంచి బూస్ట్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఓల్డ్ సిటీలో లాల్ దర్వాజా,సుధా టాకీస్, రాజన్న బావి, హరిబౌలి, గౌలిపురా, ఛత్రినాక, దూద్ బౌలి, మలక్ పేట, మాదన్న పేట, ఉప్పుగూడ జియా గూడ, మంగళ్ హాట్ వంటి ప్రాంతాల్లో హిందూ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ సారి ఈ ఓట్లన్నీ గంపగుత్తగా మాధవీలతకు పడే అవకాశాలు ఉన్నాయనే వాదన కూడా వినిపిస్తోంది.

**అసాధ్యమేమీ కాకపోవచ్చు..**

ముఖ్యంగా పాతబస్తీలో ఎక్కువ మంది చిరు ఉద్యోగులు మాధవీ లత ప్రసంగాలు వినడానికి సెలవులు పెట్టి మరి వచ్చినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఒవైసీని భయపెట్టే సివంగి వచ్చిందని అందరూ చెప్పుకున్నారు. ఇక.. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో ఉత్తర ప్రదేశ్ తరహా పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఏది ఏమైనా నకిలీ ఓట్లు తొలిగింపుతో పాటు 2 శాతం అటు వైపు ఓట్లు పడినా.. మాధవీ లతా హైదరాబాద్ స్థానంలో సంచలనం సృష్టించడం ఖాయం అని అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

# న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడి అరెస్టు చట్ట విరుద్ధం




న్యూఢిల్లీ: యుఎన్‌పిఎ(నిరోధక) చట్టం కింద న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్తను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని, ఆయనను వెంటనే జైలు నుంచివిడుదల చేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. 2023 అక్టోబర్ 4న రిమాండు విధిస్తూ జారీచేసిన రిమాండ్ దరఖాస్తు కాపీని పుర్కాయస్తకు కాని ఆయన న్యాయవాది కాని అందచేయలేదని జస్టిస బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడి ధర్మాసనం తెలిపింది. పుర్కాయస్తను అరెస్టు చేయడం, తదనంతరం రిమాండు చేస్తూ జారీచేసిన ఉత్తర్వులు చెల్లవని ధర్మాసనం స్పష్టం చేసింది. దిగువ కోర్టు సూచించిన మేరకు బెయిల్ బాండ్లను సమర్పించిన అనంతరం పుర్కాయస్తను విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అన్‌లాఫుల్ యాక్టివిటీస్(ప్రివెన్షన్) చట్టం, 1967 కింద 2023 అక్టోబర్ 3 నుంచి పుర్కాయస్త జుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక సెల్ ఆయనను అరెస్టు చేసింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ప్రకారం పుర్కాయస్తకు చెందిన న్యూస్‌క్లిక్ పోర్టల్‌కు చైనా నుంచి భారీ స్థాయిలో నిధులు అందాయి. ఇది భారతదేశ సార్వభౌమాధికారానికి అంతరాయం కలిగిస్తుందని, దేశం పట్ల అవిధేయతను దారితీస్తుందని పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ప్రక్రియను దెబ్బతీసేందుకు పీపుల్స్ అలయెన్స్ ఫర్ డెమోక్రసి అండ్ సెక్యులరిజం(పిఎడిఎస్) అనే గ్రూపుతో పుర్కాయస్త కుట్ర పన్నారని ఎఫ్‌ఐఆర్‌లో ఆరోపించారు. కాగా..పంకజ్ బన్సల్ కేసులో మనీ లాండరింగ్ చట్టం కింద తమకు సంక్రమించిన అధికారాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దుర్వినియోగం చేసినట్లు అభిశంసిస్తూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రాతిపదికగా తీసుకుంది.

# మల్టీస్టారర్ కూటమి ప్రభుత్వం ఖాయం: బుద్ధా వెంకన్న



**ఎన్టీఆర్ బ్యూరో:** మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో మల్టీస్టార్ మహా కూటమి ఏపీలో సూపర్ డూపర్ హిట్ అయిందని తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. ఏపీలో కూటమి 130 సీట్లకు పైగా సాధించబోతుందని తెలిపారు. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుద్ధ వెంకన్న మాట్లాడుతూ%క% 2019లో జగన్ ను గెలిపించేందుకు బారులు తీరిన ప్రజలు ఐదేళ్లు ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ గురించి ప్రజలు తెలుసుకుని ఈసారి ఓడించాలని కంకణం కట్టుకున్నారన్నారు. జగన్ పాలనతో విసిగిపోయిన ప్రజలు సాగనంపేలా కూటమికి ఓట్లు వేశారన్నారు. జగన్ కు ఇచ్చిన అవకాశం దుర్వినియోగం చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టారని తెలిపారు. 2019లో 79శాతం పోలైతే ప్రస్తుతం 81శాతం పోలింగ్ జరిగిందన్నారు. చంద్రబాబు నాలుగుసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఐదేళ్లల్లో అవకతవకలకు పాల్పడిన వారు ఫైళ్లు కూడా మాయం చేసేలా కుట్రలు చేస్తున్నారని, చంద్రబాబు, పవన్, మోడీ సారథ్యంలో ఏపీ అభివృద్ధి అవుతుందని ప్రజలు ఓట్లు వేశారన్నారు. చంద్రబాబు వంటి నాయకుడిని అన్యాయంగా జైల్లో పెట్టారని కక్షతో ప్రజలు జగన్ ను ఓడించాలని ఓట్లు వేశారన్నారు. సైకిల్ పై పడిన ప్రతి ఓటు చంద్రబాబును చూసి ప్రజలు వేశారనీ తెలిపారు. అభ్యర్థులను చూసి కాదు. చంద్రబాబు మళ్లీ రావాలని ఓట్లు వేశారన్నారు. రాక్షస పాలన అంతం చేసేందుకు భువనేశ్వరి, బ్రాహ్మణి కూడా ప్రజల్లోకి వచ్చారన్నారు. జగన్ కు 151 సీట్లు వచ్చినప్పుడు టీడీపీ పని అయిపోందన్నారని, కానీ చంద్రబాబు పట్టుదలతో రాష్ట్రం, ప్రజల కోసం నిలబడ్డారని గుర్తు చేశారు. నేడు మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారాన్ని అందుకుంటున్నారని చెప్పారు. నారా కుటుంబంలో ఉన్న నలుగురు చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి నాలుగు దిక్కులుగా మారి ప్రచారం చేశారన్నారు. చంద్రబాబును జైలుకు పంపిన ఘటనతో రాష్ట్ర ప్రజలు మొత్తం బాధ పడ్డారన్నారు. పవన్ కళ్యాణ్ కూడా అక్రమ అరెస్టుపై స్పందించి చంద్రబాబుకు మద్దతు ఇచ్చారని తెలిపారు. ఒక దొంగను తరిమి కొట్టేందుకు నిజాయతీ పరులు అందరూ ఒక్కటయ్యారని చెప్పారు. భేషరతుగా మద్దతు పలికి వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా పాత్ర పోషించిన పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు చెప్పారు. ఓటమి విషయం తెలిసి కూడా బొత్స సత్యనారాయణ మేకబోతు గాంభీర్యం పోతున్నారన్నారు. మహా కూటమికి 130కి పైగా సీట్లు వస్తాయి.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. కోటికొక్కడు అనే పదానికి అక్షర సత్యం నారా చంద్రబాబునాయుడుగా అభివర్ణించారు. అటువంటి వ్యక్తి పాలనలో ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. ప్రజలతో పాటు, ఉద్యోగస్తులు కూడా మహా కూటమికే ఓట్లు వేశారన్నారు. జగన్ ఎవరినీ వదలకుండా ఇబ్బందులు పెట్టారు. అందుకే సమయం చూశారు.. సాగనంపుతున్నారన్నారు. జగన్ ను ఓడించడానికే ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన తెలుగు వారంతా తరలి వచ్చారనీ, మన రాష్ట్రం, మన ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఆరాటంతో వారంతా ఏపీకి తరలి వచ్చారని గుర్తు చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి 40వేల ఓట్లతో గెలుస్తున్నారనీ, జూన్ 4న వెలువడే ఫలితాలు చూశాక మరింత ఆశ్చర్యపోతారన్నారు.

## కౌన్సిలర్ భర్తపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి




**అచ్చంపేట:** బీఆర్ఎస్ కౌన్సిలర్ భర్త సుంకరి బాలరాజు, మరికొంత మంది కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మారణాయుధాలతో దాడిచేసి గాయపరచిన వారిని అదుపులోకి తీసుకోకపోవడం చాలా దుర్మార్గమని, వారిపై ఎస్పీ, డీజీపీలు సుమోటోగా కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకుండా పైగా దాడి ఘటనపై ఫిర్యాదు చేసిన వారిపైనే పోలీసులు కేసు పెట్టడం లాంటి చర్యలను ప్రజలంతా గర్విస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీ వారి దాడిలో గాయపడిన సుంకరి బాలరాజును గువ్వల బాలరాజు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వగృహములో కలిసి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... మంగళవారం పట్టపగలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ మహిళా కౌన్సిలర్ ఇంటిపై దాడి చేసి ఆమె భర్త సుంకరి బాలరాజును, అతని తమ్ములను తదితరులను విచక్షణా రహితంగా రాళ్ళతో, దుడ్డు కర్రలతో దాడి చేసి కొట్టి, ఇంటిలోని తలపులను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి దాదాపు 24 గంటలు గడుస్తున్నా దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకోలేదని పైగా బీఆర్ఎస్ పార్టీ వారిపై కేసులు పెట్టడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోకపోతే కోర్టుతో పాటు రాష్ట్ర, జాతీయ మానవహక్కుల కమీషన్‌ను ఆశ్రయించుతామని హెచ్చరించారు. డీజీపీ, ఎస్పీ ఈ విషయంలో వెంటనే స్పందించి సుమోటోగా కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే ఏ త్యాగానికైనా వెనుకాడమని కార్యకర్తలను, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హెచ్చరించారు.

# రైతాంగాన్ని నిలువున ముంచిన కాంగ్రెస్: కెటిఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ . రైతులు కష్టాల కడగండ్లలో ఉన్నారని అయినా .. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు%క% ప్రస్తుతం తెలంగాణ రైతాంగం దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు లు స్తంభించిపోయాయని అన్నారు. తెలంగాణ భవన్ లో నేడు ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, వ్యవసాయరంగాన్ని పర్యవేక్షించే వ్యవస్థ లేదన్నారు. కామారెడ్డి లో రైతులు రోడ్లు ఎక్కరని తెలిపారు. హమాలీ లా కొరత ఉందన్నారు. ఎన్నికలు ముగిశాయి కాబట్టి ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు మీద దృష్టి పెట్టాలని సూచించారు. తరుగు లేకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒక్క దగ్గర కాదు చాలా చోట్ల ఇదే పరిస్థితి అన్నారు. రైతులు ఆందోళనలో ధర్నాలు చేస్తున్నారని తెలిపారు.

ఇరువై ఐదు,ముప్పై రోజులుగా ధాన్యం తీసుకు వచ్చిన కొనుగోలు చేయడం లేదన్నారు. తడిసిన దాన్యం,తరుగు లేకుండా ఎఫ్ సి ఐ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు.. క్వింటాల్ కి బోనస్.. రుణమాఫీ అయ్యేంత వరకు తాము రైతుల వెంట ఉంటామన్నారు. అవసరం అయితే రైతుల కోసం ధర్నాలు, దీక్షలు నిర్వహిస్తామని,..రోడ్ల మీదకు వస్తామని హెచ్చరించారు.

ఖమ్మం,వరంగల్,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ లలో గత 4 ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిచిందన్నారు. ఆ జిల్లాల పట్టభద్రులు గెలిపిస్తారని నమ్ముతున్నామని తెలిపారు. విద్యావంతుడు, ఉత్సాహవంతుడు రాకేష్ రెడ్డి నీ కేసిఆర్ బరిలో నిలిపారన్నారు. ఓటర్లకు మా విజ్ఞప్తి.. కాంగ్రెస్ మోసపూరిత హామీలు విన్నారు.. ఐదు నెలల పాలన లో ఎలా దగ్గా చేశారో చూశారన్నారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అన్నారు ఏ మాట నిలబెట్టుకోలేదన్నారు. టెట్ కోసం గతంలో 4వందల ఫీజు ఉంటే.. ఐదు రెట్లు పెంచి రెండు వేలు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు.. వసతుల కోసం నిబద్ధతతో పని చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. ఐదు నెలలు కాంగ్రెస్ ఎలా మోసం చేసిందో చూశారన్నారు. నల్గొండలో ఒక్క మెడికల్ కళాశాల కూడా లేకుండే.. తీసుకువచ్చింది




కేసిఆర్ అని గుర్తుచేశారు.

సీఎం ముప్పై వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదన్నారు కెటిఆర్ . ఈ ప్రభుత్వానికి ఐదు నెలల కాలపరిమితి ముగిసిందన్నారు. మరో ఏడు నెలల కాలంలో రెండు లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీసే గొంతుక కావాలి అంటే రాజేష్ రెడ్డి నీ గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయులర్.. ఎప్పటికప్పుడు ఎవరిని నిందిస్తాడో తెలియదన్నారు. ఆయన్ను గెలిపిస్తే మరో నయీంగా మారుతాడన్నారు. టీవీ చానెళ్లు అడ్డుపెట్టుకొని బెదిరించే మరో బ్లాక్మెయిల్ ను గెలిపించకూడదన్నారు. చిల్లర రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారన్నారు.

కేసిఆర్ సమర్ధవంతంగా ప్రభుత్వాన్ని నడిపారన్నారు. రేవంత్ రెడ్డి ముఖం బాగోలేక అద్దం పగలగిట్టుకున్నాట్లు ఉందన్నారు. నిన్న నారాయణ ఖేడ్ లో టీచర్ లా మీద పోలీసులు లాఠీ చార్జి చేస్తున్నారని తెలిపారు. వారు ఎన్నికల్లో పాల్గొన్నందుకు తగిన వేతనం ఇవ్వాలని అడగడం తప్పా? అన్నారు. మూడు లక్షల 89 వేల కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు అని కేంద్రం చెప్పిందన్నారు. ఏడు లక్షల కోట్లు అని కాంగ్రెస్ ప్రచారం చేసిందన్నారు. అప్పు అనేదే తప్పు అన్నట్లు ప్రచారం చేసిన కాంగ్రెస్ సన్నాసులు ఇప్పుడు అప్పులు ఎందుకు చేస్తున్నారు.

**రాహుల్ జీ... ప్రేమ పంచడం అంటే ఇదేనా**

'రాహుల్ గాంధీ గారూ! మీరు చెప్పే ప్రేమను పంచడం అంటే ఇదేనా?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అచ్చంపేటలో బుధవారం బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడ్డారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ నేతలపై దాడి చేస్తున్న ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన జత చేశారు. 'నిన్న అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ గూండాల దాడిలో స్థానిక పోలీసుల ప్రేక్షక పాత్ర చూడండి' అంటూ ఆరెస్పీ తెలంగాణ డీజీపీని ట్యాగ్ చేస్తూ ఓ ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ రీట్వీట్ చేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com